విశాలాంధ్ర

తిరుపతి జిల్లా

చిత్తూరు జిల్లా

మంగళవారం 07 జనవరి 2025 8 పేజీలు

దేశంలోనే అత్యుత్తమ నియోజకవర్గంగా

కుప్పంని అభివృద్ధి చేస్తా

- రాష్ట్రానికి ముఖ్యమంత్రినైనా కుప్పానికి ఎమ్మెల్యేనే
- పీపీపీ విధానంతో కుప్పం దశాదిశ మారుస్తా
- యువతకు ఉద్యోగ, ఉపాధి లక్ష్యంగానే అడుగులు
- స్వర్ణ కుప్పం విజన్-2029 డాక్యుమెంట్‌ను ఆవిష్కరించిన ముఖ్యమంత్రి చంద్రబాబు

కుప్పం నియోజకవర్గ మూడురోజుల పర్యటనలో భాగంగా సిఎం, కుప్పం నియోజకవర్గ ఎం ఎల్ ఎ చంద్రబాబు నేడు పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్బంగా చంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్రానికి ముఖ్యమంత్రిని అయినా కుప్పానికి ఎమ్మెల్యేనే అని, 8 సార్లు ఎమ్మెల్యేగా గెలిపించి ఆదరించిన కుప్పం ప్రజల రుణం ఎప్పటికీ తీర్చుకోలేనని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. గత పాలకులు కక్షపూరితంగా కుప్పం అభివృద్ధిని అడ్డుకున్నారని, టీడీపీ కార్యకర్తలను ఇబ్బందులపాలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

వార్త మెయిన్‌లో

గడువులోపు అర్జీలకు పరిష్కారం చూపాలి

- తిరుపతి కలెక్టరేట్ ప్రజా వేదికకు 214 అర్జీలు

- జిల్లా కలెక్టర్ డా. ఎస్.వెంకటేశ్వర్

విశాలాంధ్ర-తిరుపతి కలెక్టరేట్: రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని, (పిజిఆర్ఎస్) కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు గడువు లోపు సంతృప్తి స్థాయిలో పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం జిల్లా కలెక్టరేట్ నందు ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) లో జిల్లా కలెక్టర్ అర్జీదారులకు గౌరవప్రదంగా కుర్చీ ఏర్పాటుతో వారి సమస్యలను సావధానంగా వింటూ అర్జీలు స్వీకరించారు. జిల్లాలోని డివిజన్,

2

యూనివర్సిటీలో స్క్రాప్ కుంభకోణానికి కారణమైన అధికారులను

సస్పెండ్ చేయాలి



- స్క్రాప్ తరలింపుపై సమగ్ర విచారణ జరిపించాలి

- ఉన్నత విద్యా మండలి చైర్మన్ మధు మూర్తికి ఏఐఎస్ఎఫ్ వినతి

విశాలాంధ్ర - తిరుపతి: శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీలో గత కొద్దిరోజులుగా అక్రమంగా తరలిస్తున్నటువంటి స్క్రాప్ పై సమగ్ర విచారణ జరిపించాలని, ఈ కుంభకోణానికి కారణమై నటువంటి అధికారులను సస్పెండ్ చేయాలని ఉన్నత విద్యా మండలి చైర్మన్ మధు మూర్తికి ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి శివారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్ జీ వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూనివ ర్సిటీలో ఎన్నడు లేని విధంగా యూనివర్సిటీలోని స్క్రాప్ ను నిబంధనలు పాటించకుండా గుట్టుచప్పుడు కాకుండా విక్రయించి లారీల ద్వారా తరలించి సొమ్ము పోగు చేసుకున్నారని, సుమారు 60 లక్షల రూపాయల కుర్చీలు, ఇనుము, పేపర్స్, ప్లాస్టిక్ స్క్రాప్ ను కేవలం ఎనిమిది లక్షలకు అమ్మి వేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు అక్రమంగా యూనివర్సిటీలోని స్క్రాప్ ను ఎటువంటి టెండర్స్ పిలవకుండా పేపర్ ప్రకటన లేకుండా విక్రయించడం యూనివర్సిటీ ఆస్తిని కొల్ల గొట్టడం అవుతుందని మండిపడ్డారు. ఎంతో గొప్ప

2

నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించండి

- సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి: ఎన్నికల హామీ మేరకు నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని భారత కమ్యూనిస్టు పార్టీ తిరుపతి జిల్లా కార్యదర్శి పి.మురళి డిమాండు చేశారు. శ్రీకాళహస్తి ఆర్డీవో కార్యాలయం ఎదుట సోమవారం సీపీఐ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మురళి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు వంతున నిరుపేద లకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తక్షణమే ఎన్నికల హామీలను నెరవేర్చాలన్నారు. వ్యవసాయ చేస్తున్న రైతాంగానికి సాగు భూములు ఇస్తామన్న హామీ కూడా నెరవేర్చాలన్నారు. చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చడంలో పూర్తిగా వైఫల్యం చెందాడన్నారు. రైతు భరోసా, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, టిడ్కో ఇళ్లను కేటాయించడం ఇంకా చేయలేదన్నారు. ఇక ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు చిన్నం పెంచలయ్య మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాల్లో ఉమ్మడి కుటుంబంగా ఉన్న నిరుపేదలు ఇళ్లు లేక అనేక ఇబ్బందులు

2

గోవిందమాల భక్తులపై ....

దూసుకెళ్లిన 108 అంబులెన్స్

- ఇద్దరు మృతి, ముగ్గరికి గాయాలు

విశాలాంధ్ర - చంద్రగిరి: చంద్రగిరి మండలం ఎ.రంగంపేట- నరశింగాపురం మార్గమధ్యమంలో శ్రీవారి దర్శనానికి వెళ్తున్న గోవింద మాల భక్తులపై 108 అంబులెన్స్ వాహనం వెనక వైపు నుండి దూసుకెళ్ళటంతో ఇద్దరు భక్తులు మృతి చెందారు. మరో ముగ్గురికి గాయాలు కాగా అందులో ఓ వ్యక్తి ప్రాణాపాయ స్థితిలో ఉన్నట్లు సమాచారం. మృతి చెందిన వ్యక్తులు అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం చెంపాలపల్లికి చెందిన పెద్దరెడ్డమ్మ (40), శేగంవారిపల్లికి చెందిన లక్ష్మమ్మ (45) గా తెలిసింది. మదనపల్లి నుంచి తిరుపతి రుయా ఆసుపత్రికి రోగిని తీసు కొస్తున్న 108 సిబ్బంది పుంగనూరు నుంచి తిరుమల కు పాద యాత్ర చేస్తున్న ఐదు మంది భక్తులు పైకి దూసుకెళ్లటంతో ఈ ప్రమాదం జరిగింది. గాయాలైన వారిని అదే 108 వాహనంలో చికిత్స నిమిత్తం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ఉదయం సుమారు 3:30 నుండి 4 గంటల ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగింది. వైద్యం కొరకు మదనపల్లి నుండి తిరుపతికి రోగిని తీసుకొస్తున్న 108 డ్రైవర్ ప్రమాదం చేసి చంద్రగిరి పోలీసులకు సమాచారం ఇచ్చి పోలీస్ స్టేషన్లో లొంగిపోయాడు. 108 డ్రైవర్ దట్టమైన పొగ మంచు కారణంగా రోడ్డు కనపడక ప్రమాదం జరిగినట్లు పోలీసులకు తెలిపినట్లు సమాచారం. పోలీసుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అర్జీలకు పరిష్కారం చూపాలి

(మొదటి పేజీ తరువాయి) మండల స్థాయి వరకు ఆర్డీవోలు తాసిల్దారులు, ఎంపిడిఓలు తదితర అధికారుల వీడియో కాన్ఫరెన్స్ అనుసంధానంతో అర్జీదా రుల సమస్యలపై అధికారులతో అక్కడికక్కడే వర్చువల్ విధానంలో మాట్లాడి పరిష్కారం చూపుతున్నారు. ఈ సందర్భంగా పీజిఆర్ఎస్ అర్జీలను నిర్దేశిత గడువులోపు పరిష్క రించాలి అని, పెండింగ్ అర్జీలను నిర్ణీత గడువులోగా అర్థవంతంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ తో పాటు జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, డిఆర్ఓ నరసింహులు, తదితర అధికారులు ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి వినతులను స్వీకరించి, ఆన్లైన్ నమోదుతో అర్జీదారులకు రసీదులు అందించారు. శాఖల వారీగా అర్జీల వివరాలు : రెవెన్యూ -148, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్ -13, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ -3, పురపాలక శాఖ -11, రూరల్ డెవలప్మెంట్ -2, పంచాయతీరాజ్ -8, వైద్య ఆరోగ్యశాఖ -3, ఐసిడిఎస్ పిడి -3, గృహ నిర్మాణ శాఖ -2, నీటిపారుదల శాఖ -2, ఆర్ డబ్లూఎస్ -1, ఏపీ టౌన్షిప్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ -2, వికలాంగులు వయోవృద్ధుల సంక్షేమ శాఖ కార్పొరేషన్ -2, పోలీస్ శాఖ -4, పశుసంవర్ధక శాఖ -1, సెర్ఫ్ -1, విద్యాశాఖ -4, లీడ్ బ్యాంక్ మేనేజర్ -1, విద్యుత్ శాఖ -1, పౌరసరఫరాల శాఖ -1, ఎక్సైజ్ శాఖ -1, వెరసి మొత్తం 214 వినతులు రావడం జరిగిందని సంబంధిత అధికారులు అందరు వచ్చిన అర్జీలపై ప్రత్యేక దృష్టి పెట్టి వేగవంతంగా పరిష్కరించాలని స్పందనకు హాజరయిన వివిధ శాఖలకు సంబందించిన జిల్లా అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

ఇళ్ల స్థలాలు కేటాయించండి

(మొదటి పేజీ తరువాయి) పడుతున్నారన్నారు. దళిత, గిరిజనులకు రూ.5లక్షలు రుణం మంజూరు చేసి ప్రభుత్వమే ఇల్లు నిర్మించి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు ప్రతిష్టాత్మకంగా నిర్వహి స్తున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు పని కల్పించడంలో నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తున్నారని ఆయన విమర్శిం చారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి పని కల్పించాలన్నారు. లేని పక్షంలో సీపీఐ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పోరాటం ఉధృతం చేస్తామని చిన్నం పెంచలయ్య హెచ్చరించారు. అనంతరం శ్రీకాళహస్తి రెవెన్యూ డివిజనల్ అధికారికి ఇళ్ల స్థలాల కోసం సామూహికంగా అర్జీలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏ. రామానాయుడు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె. రాధాకృష్ణ, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జనమాల గురవయ్య, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జె.తులసి రాజన్, సహాయ కార్యదర్శి మించల శివకుమార్, సీపీఐ పట్టణ కార్యదర్శి గోపి, ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు చందు, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షురాలు చారులత, నాయకులు మణి, మురళి, జనార్ధన్, మునిరాజా తదితరులు పాల్గొన్నారు.

సస్పెండ్ చేయాలి

(మొదటి పేజీ తరువాయి) చరిత్ర కలిగిన టువంటి ఎస్వీ యూని వర్సిటీ ప్రతిష్టతను దెబ్బతీసే విధంగా అధికారులు వ్యవహరిస్తున్నారని, విద్యార్థుల నిలయాల ను రాజకీయ నిలయాలుగా మార్చి వారి యొక్క ఆదాయాల కోసం యూనివర్సిటీ ఆస్తులను కొల్లగొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతర్గతంగా చర్చలు జరుపుకొని నచ్చిన వ్యక్తులకి టెండర్లు ఇచ్చి యూనివర్సిటీ అధికారులకి ముడుపులు అందితే చాలు అన్నట్టుగా వ్యవహరించి యూనివర్సిటీ ఆస్తిని పూర్తిగా కొల్లగట్టడం సరైన పద్ధతి కాదని ఆవేదన వ్యక్తం చేశారు తక్షణమే స్క్రాప్టర్ను రద్దుచేసి సరైన పద్ధతిలో స్క్రాప్ టెండర్ను నిర్వహణ జరిపించాలని డిమాండ్ చేశారు. దాదాపు 20 ర్యాలీల స్క్రాప్‌ను అక్రమంగా తరలించారని ఈ తరలింపు పై సమగ్ర విచారణ తక్షణమే జరిపించాలని ఇంకా ఇటువంటి అన్యాయాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఫ్లెక్సీలు, బోర్డులు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు

- కమిషనర్ ఎన్.మౌర్య

విశాలాంధ్ర-తిరుపతి కార్పొరేషన్: నగరంలో ఎక్కడైనా కూడళ్లు, పుట్ పాత్లు తదితర ప్రాంతాల్లో ఫ్లెక్సీలు, బోర్డులను ఏర్పాటు చేస్తే కఠినచర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య హెచ్చరించారు. నగరంలో ఫ్లెక్సీలు, బోర్డుల ఏర్పాటు, టి.డి.ఆర్. బాండ్ల పంపిణీపై టౌన్ ప్లానింగ్ అధికారులతో కమిషనర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో జనన, మరణాలు, పండుగలకు, రాజకీయ నాయకుల ఫ్లెక్సీలను, బోర్డులను నగరంలోని పలు కూడళ్లలో, ఫుట్ పాత్ లపై ఏర్పాటు చేస్తున్నారని అన్నారు. దీంతో వాహన చోదకులు, ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కాబట్టి నగరంలో ఫ్లెక్సీలు, బోర్డులను, ఏర్పాటు చేయరాదని అన్నారు. అనుమతులు పొందిన హోర్డింగులపైన మాత్రమే ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది నగరంలో పర్యవేక్షణ చేసి ఎక్కడైనా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన వాటిని తొలగించి వారికి అపరాధ రుసుము విధించాలని అధికారులను ఆదేశించారు. టి.డి.ఆర్. బాండ్లు పంపిణీకి అన్ని దస్త్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలని అన్నారు. అన్ని సక్రమంగా ఉన్నవారికి బాండ్లు పంపిణీ చేసేందుకు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, ఆర్.డి. సంజీవ్ కుమరన్, సబ్ రిజిస్ట్రార్ నీరజ, డిసిపి మహాపాత్ర, తుడ సీపీఓ దేవికుమారి, ఏసిపి బాలాజి, టిపిబిఓ లు, తదితరులు పాల్గొన్నారు.

స్కీమ్ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలి

- ఏఐటియుసి ఆధ్వర్యంలో తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద స్కీమ్ వర్కర్ల ధర్నా

- జాయింట్ కలెక్టర్‌కి వినతిపత్రం సమర్పణ

విశాలాంధ్ర - తిరుపతి : ఏఐటియుసి స్కీమ్ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని దేశవ్యాప్తంగా ఈ నెల 7వ తేదీన నిరసన కార్యక్రమాలకు పిలుపునివ్వడం జరిగింది అందులో భాగంగా తిరుపతి జిల్లా పరిధిలో స్కీమ్ వర్కర్లందరూ సోమవారం ఉదయం 11 గంటలకు తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించి విడివిడిగా జాయింట్ కలెక్టర్‌కి వినతి పత్రాలను సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు ఎన్.చంద్రశేఖర్ రెడ్డి అంగన్వాడీ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు సిహెచ్ శివకుమార్ స్కీం వర్కర్లు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని స్కీమ్ వర్కర్లు అందరినీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని గుర్తింపు కార్డులు నాణ్యమైన యూనిఫామ్ లు ప్రభుత్వ సంక్షేమ పథకాలు స్కీమ్ వర్కర్లు అందరికీ వర్తింపచేయాలని ముఖ్యంగా అంగన్వాడీ కార్మికులు గత ప్రభుత్వ హయాంలో 42 రోజులపాటు సమ్మె నిర్వహించి పెద్ద ఎత్తున ఆందోళన పోరాట కార్యక్రమాల నిర్వ హణ ఫలితంగా అప్పటి ప్రభుత్వం కొన్ని హామీలను ఇచ్చిందని ఆహా మీద అమలు కోసం నూతనంగా రాష్ట్రంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వానికి రాష్ట్రస్థాయి అధికారులకు వినతి పత్రాలు ఇవ్వడం కలిసి చర్చించడం జరిగిందని పెద్ద ఫలితం కనిపిం చలేదని అందుకే దేశవ్యాప్తంగా ఏఐటియుసి నిరసన కార్యక్రమా లకు పిలుపునివ్వడం జరిగిందని. అయితే ఏడవ తేదీన జిల్లాలో ముఖ్యమంత్రి పర్యటన మరియు ఆశ డే అంగన్వాడీలకు కూడా సర్వేలు ఉన్న కారణంగా సోమవారం కార్యక్రమాన్ని నిర్వహిం చడం జరిగిందని వారు అన్నారు. అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కే.నాగరాజమ్మ కోశాధికారి మంగమ్మ లు మాట్లాడు తూ అంగన్వాడీ కార్మికులు చేసిన పోరాటం 42 రోజుల సమ్మె ఫలితంగా ఇచ్చిన హామీలు అమలు పరచాలని మెరుగైన జీతం అందిస్తామన్న కూటమీ ప్రభుత్వం మాట నిలబెట్టుకోవాలని- మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా గుర్తించాలని విధుల్లో ఉండి చనిపో యిన అంగన్వాడి భర్తలకు 5 లక్షల రూపాయల నష్టపరిహారం 20 వేల రూపాయలు మట్టి ఖర్చులకు ఇవ్వాలని వారు అన్నారు. మధ్యాహ్న భోజనం మరియు స్కూల్ స్వీపర్స్ యూనియన్ నాయకులు బాబు లాజరస్ లు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు మెనూ చార్జీలు పెంచాలని ఇస్కాన్ భోజన పథకాన్ని రద్దుచేసి ఏజెన్సీల ద్వారా వండి నాణ్యమైన భోజనాన్ని పిల్లలకు వండి పెట్టాలని గ్యాస్ ను ప్రభుత్వమే ఉచితంగా సరఫరా చేయాలని. ఆయా లకు ఈఎస్ఐ పీఎఫ్ సౌకర్యం కల్పించాలని. పెండింగ్ జీతాలు వెంటనే మంజూరు చేయాలని చిరు ఉద్యోగులపై రాజకీయ వేధింపులు మానుకోవాలని జీతం కనీసం పదివేల రూపాయలు ఇవ్వాలి డిఇఓ ద్వారా గుర్తింపు కార్డులు మంజూరు చేయాలి అని వారు అన్నారు ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఆశా కార్మికులకు ప్రమోషన్ ఇవ్వాలని ఖాళీలు భర్తీ చేయాలని డిఎంహెచ్వో ద్వారా గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ప్రమోషన్లు కల్పించాలి డ్యూటీలో ఉండి చనిపోయిన వారికి ఐదు లక్షల రూపాయలు చెల్లించాలి పెండింగ్ అలవెన్సు వెంటనే విడుదల చేయాలి. రిటైర్మెంట్ వయసు 60 సంవత్సరాల నుండి 62 కు పెంచాలి రిటైర్మెంట్ అయిన తర్వాత కనీసం పదివేల రూపాయల పింఛన్ సౌకర్యం కల్పించాలి అన్నారు ధర్నా అనంతరం ఆయా యూనియన్ల వారిగా జాయింట్ కలెక్టర్‌కి వినతి పత్రాలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో సుశీల ఉమా నాగమణి సుబ్రహ్మణ్యం మహమ్మద్ సుజాత రాజేశ్వరి సుహాసిని నాగవేణి ఎల్లమ్మ రెడ్డమ్మ ఆసిఫా మరియు స్కీం వర్కర్లు పాల్గొన్నారు.

జిల్లాలో రెవెన్యూ సదస్సులకు 186 అర్జీలు

విశాలాంధ్ర - తిరుపతి కలెక్టరేట్ : ప్రజల వద్దకు పాలనా సందర్భంగా రెవిన్యూ సదస్సులు జరుగుతున్న నేపథ్యంలో గ్రామ, మండల స్థాయిలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం డిసెంబర్ 6 నుండి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులకు సంబంధించి సోమవారం తిరుపతి జిల్లాలో నిర్వహించిన గ్రామ రెవెన్యూ సదస్సులో రెవెన్యూ, భూ సమస్యలను సులభతరంగా పరిష్కరించుకోవడానికి అనువైన వేదిక రెవెన్యూ సదస్సులు అని ఈ వేదికను మండల గ్రామ స్థాయిలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రెవెన్యూ సమస్యల పరిష్కారం కొరకు జిల్లావ్యాప్తంగా నేడు 31 గ్రామ సభలను నిర్వహించడం జరిగిందని తెలిపారు. గ్రామ ప్రజలకు భుసమస్యలు పరిష్కరించుకోనుటకు అనువైన వేదిక రెవెన్యూ సదస్సులు అని ఈ వేదికను మండల గ్రామ స్థాయిలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ రెవిన్యూ సదస్సులలో స్థానిక ప్రజా ప్రతినిధులు, మండల రెవెన్యూ, సంబందిత అధికారులు పాల్గొని విజయవంతంగా రెవెన్యూ సదస్సుల ద్వారా వచ్చిన వివిధ సమస్యలతో కూడిన దరఖాస్తులు అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి చిన్న చిన్న సమస్యలు ఉన్న వాటిని అక్కడికక్కడే పరిష్కరించారన్నారు. తిరుపతి జిల్లాలో మొదటి రోజు నుండి నేటి వరకు జిల్లావ్యాప్తంగా 16097 అర్జీలు అందాయని అందులో నేడు 186 అర్జీలు వచ్చాయని అందులో అసైన్మెంట్ ఆఫ్ హౌస్ సైట్స్ పై -53, అసైన్మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ల్యాండ్ పై -2, క్యాస్ట్ వెరిఫికేషన్ -2, మీ సేవ ద్వారా రెవెన్యూ పై -0, రీ సర్వే పై -4 , ల్యాండ్ గ్రాబింగ్ పై -0, ఫాం 22ఎ పై -0, ఆర్ఓఆర్ పై -82, ఇనాం పై -0, ఇతర విషయాలకు సంబంధించి 41 వచ్చాయని తెలిపారు. సోమవారం మరియు ముందుగా వచ్చిన మొత్తం అర్జీలలో 709 అర్జీల సమస్యలను పరిష్కరించడం జరిగిందని మిగిలిన అర్జీల సమస్యలను కాల పరిమితి లోపల సంబందిత అధికారులు పరిష్కరిస్తారని జిల్లా కలెక్టర్ తెలిపారు.

ఇంటర్మీడియట్ పరీక్షలపై ప్రత్యేక శ్రద్ధ

విద్యార్థులు మార్కులతో ఉత్తీర్ణులయ్యేలా ప్రిన్సిపాల్ లు చర్యలు చేపట్టాలి

విశాలాంధ్ర - తిరుపతి కలెక్టరేట్: ఇంటర్మీడియట్ పరీక్షలకు విద్యార్థినీ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి అందరూ మంచి మార్కులతో ఉత్తీర్ణులయ్యేలా ప్రిన్సిపాల్ లు చర్యలు చేపట్టాలని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి విశ్వనాథ నాయక్ అన్ని జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్ లకు సూచించారు. సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ ఆదేశాల మేరకు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి జిల్లాలోని 21 ప్రభుత్వ మరియు ఒక ఎయిడెడ్ ప్రైవేట్ కళాశాలల ప్రిన్సిపాల్ లతో త్రైమాసిక మరియు అర్థ వార్షిక పరీక్షలలో విద్యార్థిని విద్యార్థులు సాధించిన మార్కుల పై సమీక్ష నిర్వహించి మాట్లాడుతూ సబ్జెక్టుల నందు 50 శాతం కన్నా తక్కువ మార్కులు వచ్చిన పిల్లలను గుర్తించి వారు ఏ సబ్జెక్టు నందు బలహీనంగా ఉన్నారో సంకల్ప్ 2025 లో భాగంగా అందులో వారికి ప్రత్యేక శిక్షణనిచ్చి కళాశాలలో ఐపిఈ 2025 నందు వంద శాతం ఉత్తీర్ణులు అయ్యేలా తప్పకుండా తగు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని అన్ని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ లు పాల్గొన్నారు.

ఎస్వీ యూనివర్సిటీలో సామూహిక

సూర్యనమస్కారం లోగో ఆవిష్కరణ

విశాలాంధ్ర-తిరుపతి రూరల్: పరాక్రమం దివాస్ నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి, వివేకానంద తపస్సు దినోత్సవం పురస్కరించుకొని తిరుపతిలో ఈనెల 23న 10వేల మందితో జరగనున్న సూర్య నమస్కారం లోగోను శ్రీవెంకటేశ్వర యూనివర్శిటీ వైస్ చాన్సలర్ అప్పారావు ఆవిష్కరించారు. శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ గ్రౌండ్ లో తిరుపతి వివేకానంద కేంద్రం, ఎస్వీయూ సంయుక్తంగా సూర్యనమస్కారం నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా సోమవారం ఉదయం ఎస్వీయూ వైస్ ఛాన్సలర్ అప్పారావు తోపాటు,రిజిస్ట్రర్ భూపతి నాయుడు,వివేకానంద కేంద్రం తిరుపతి సంచాలక్ చెరుకూరు వేంకటేశ్వర ప్రసాద్ లోగో ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంచాలక్ చెరుకూరు వేంకటేశ్వర ప్రసాద్ మాట్లాడుతూ ఈ నెల 23వ తేది పరాక్రమం దివాస్ సందర్భంగా తిరుపతి లోని విద్యార్థుల తో కలిసి 10 వేల మందితో సామూహిక సూర్య నమస్కారం కార్యక్రమం నిర్వహిస్తాం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతిలోని అన్ని యూనివర్సిటీలు, కాలేజిలు, స్కూల్స్ విద్యార్థులు మొత్తం పది వేల మంది పాల్గొటారన్నారు. ఈ సూర్య నమస్కారం కార్యక్రమంలో పట్టణ ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. తిరుపతి లోని వివేకానంద ప్రాంత సంగటక్ రవి నాయుడు, సురేంద్ర, సుమన, వివేక్, గంగాధర్ పాల్గొన్నారు.

ఈఎస్ఐ హాస్పిటల్ సూపరిండెంట్

డాక్టర్.శ్యామ్ బాబుకి అభినందనలు

విశాలాంధ్ర-తిరుపతి రూరల్: తిరుపతి ఈ.ఎస్.ఐ హాస్పిటల్ 50 పడకల నుండి 100 పడకలు చేసిన సందర్భంగా బాలాజీ నర్సింగ్ కాలేజ్ అధినేత డాక్టర్ ఎలమంచిలి ప్రవీణ్ ఆ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్. శ్యామ్ బాబుని పుష్ప గుచ్ఛంతో అభినందించారు. అలాగే నూతన సంవత్సర శుభాకాంక్షలు తో పాటు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైనందుకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రవీణ్ మాట్లాడుతూ డాక్టర్ శ్యాం బాబు నిబద్ధత కలిగిన కార్యదీక్ష కలిగిన వైద్యుడు మరియు అడ్మినిస్ట్రేటర్ అని వీరి ఆధ్వర్యంలో ఈ.ఎస్.ఐ ఆసుపత్రి ఎంతో అభివృద్ధి చెందుతుందని ఆకాంక్షించారు. డాక్టర్ శ్యాం బాబు మాట్లాడుతూ దాదాపు 6 లక్షల కార్మికులు కలిగిన ఈఎస్ఐ పరిధిలో వంద పడకల ఆసుపత్రిగా తీర్చిదిద్దడం కార్మికులకి ఎంతో అవసరమని 24 గంటలు ఇక్కడ వైద్య సేవలు అందించడానికి ప్రభుత్వం 191 పోస్టులు త్వరలోనే భర్తీ చేయనున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జెస్సి గ్రేస్, విజయ కుమారి, బి.విజయన్ తదితరులు పాల్గొన్నారు.

గో సేవతో సమస్త దేవతలనూ పూజించిన ఫలితం

విశాలాంధ్ర-తిరుపతి: సోమవారం జీవకోన విశ్వం హై స్కూల్ నందు సంస్కార్ ఫౌండేషన్ మరియు విశ్వం విద్యా సంస్థల ఆధ్వర్యంలో హైందవ సంస్కృతి గోవు పాత్రపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గో గీత వ్యవస్థాపక అధ్యక్షులు సురభి దాస్, విద్యార్థులకు భగవద్గీత, గోవు గురించి పలు అంశాలు ప్రవచించారు. గీతా, గోవు ఒకటి సంస్కారం ఇస్తే, మరొకటి ఆరోగ్యం ఇస్తూ మన జీవన విధానానికి బాసట గా నిలుస్తున్నాయి అని, విద్యార్థుల జీవన విధానం లో మార్పుల ను సూచించారు. అలాగే సంస్కార్ ఫౌండేషన్ అధ్యక్షుడు సంస్కార్ రాజేష్ మాట్లాడుతూ భగవద్గీత గోవు రెండు ప్రతి ఒక్కరి జీవితంలో గొప్ప మార్పును అందిస్తాయి అని చెప్పారు. విద్యార్థులు తప్పకుండా గోవు పదార్థాలను ఉపయోగించాలి అని చెప్పారు. ప్రముఖ వైద్యులు శ్రీ పార్థసారథి విద్యార్థులకు ఆహార నియమాలు గురించి అవగాహన కల్పించారు.విశ్వం విద్యా సంస్థల డైరెక్టర్ ఎన్.విశ్వ చందన్ రెడ్డి మాట్లడుతూ విద్యార్థులకు ఇలాంటి వారితో అవగాహన కార్యక్రమాలను నిర్వహించి వారిని విలువలతో కూడిన విద్యను అందించే కార్యక్రమాలు చేపడుతున్నాం అని తెలియజేసారు. కార్యక్రమంలో విశ్వం విద్యా సంస్థల కరస్పాండెంట్ ఎన్.తులసి విశ్వనాథ్, శివరామి రెడ్డి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కిషోర్ వికాసంపై మండల స్థాయి శిక్షణ

విశాలాంధ్ర - రామచంద్రాపురం : కౌమార బాలికలకు అవగాహనపై మండల స్థాయిలోని వార్డు సభ్యులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం సోమవారం ఎంపిడిఓ కార్యాలయంలో జరిగింది ఈకార్యక్రమంలో వెల్ఫేర్ ఆఫీసర్స్ మహిళ సంరక్షకులు, వైద్య సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలకు ఐసిడిఎస్ సిడిపిఓ ప్రతిభ, ఏసిడిపిఓ. అంగ న్వాడి సూపర్వైజర్ రేవతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఎంపీడీవో ఇందిర మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టుట, లైంగిక వేదిక నుండి రక్షణకు, చదువులు పరిశుభ్రత జీవన నైపుణ్యాలను గురించి వివరించారు. రక్తహీనత సంపూర్ణ ఆహారం ఆరోగ్యం లింగ వివక్షత గురించి వివరించారు, ఆత్మ రక్షణ పిల్లల హక్కులు, నాణ్యమైన విద్య వివరించారు ఈ కార్యక్రమంలో ఆసీడీపీవో. జ్యోతి. హెల్త్ సూపర్వైజర్. సువర్ణమ్మ సీడీపీవో.ప్రదీప లు పాల్గొన్నారు.

పాఠశాలలో చెట్ల నరికివేత పై నివేదిక పంపుతాం

మహేశ్వర రావు, ఎంఈవో

విశాలాంధ్ర-వెదురుకుప్పం: మండలంలోని మాంబేడు పంచాయతీ బలసలగుంట ప్రాథమిక పాఠశాల ఆవరణలో చెట్లు నరికివేత విషయమై జిల్లా విద్యాశాఖ అధికారి వరలక్ష్మి ఆదేశాల మేరకు విచారణ నివేదిక పంపుతామని మండల విద్యాశాఖ అధికారి మహేశ్వరరావు తెలిపారు. సోమవారం పాఠశాల స్థలానికి చేరుకుని విచారణ చేపట్టినట్లు చెప్పారు. చెట్లు నరికివేసిన వారి వద్ద నుంచి వివరణ తీసుకున్నామని అన్నారు. మండల అభివృద్ధి అధికారి, తహసీల్దార్‌తో చర్చించడం జరిగిందన్నారు. తుది నివేదిక జిల్లా విద్యాశాఖ అధికారికి పంపుతామని వివరించారు.

రైతు బాంధవుడు చంద్రబాబు నాయుడు

విశాలాంధ్ర- ఓజిలి: రైతు బాంధవుడు చంద్రబాబు నాయుడని టిడిపి నాయకులు నలజాల రాజశేఖర్ తెలియజేశారు. సోమవారం మండలంలోని గ ద్దగుంట పంచాయతీ జోషుల వారి కండ్రిగ గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. రైతులకు సబ్సిడీతో వ్యవసాయ పనిముట్లు, వరి విత్తనాలు, రైతు పండించిన ధాన్యానికి సకాలంలో బిల్లులు వంటివి ఎన్నో కార్యక్రమాలు రైతుల అభివృద్ధి కోసం ప్రవేశపెడుతున్నారన్నారు . రైతుల భూ సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మండలంలోని గ్రామాల్లో రెవిన్యూ సదస్సులు ఏర్పాటు చేయడం వలన రైతుల సమస్యలు పరిష్కరించుకుంటూ హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు సూళ్లూరుపేట ఇన్చార్జ్ నెలవల సుబ్రమణ్యం, ఎమ్మెల్యే విజయ్ శ్రీ ఆధ్వర్యంలో నియోజకవర్గం దిన దిన అభివృద్ధి చెందుతుందన్నారు డిప్యూటీ తాసిల్దార్ మధుసూదన్ రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మండల టిడిపి ప్రధాన కార్యదర్శి దాసరి నిరంజన్, కాంగ్రెస్ పార్టీ మండల సీనియర్ నాయకులు గాడి వెంకటయ్య పలువురు టిడిపి నాయకులు, రైతులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

టెలికాం ఎంప్లాయిస్ యూనియన్ సర్కిల్ ఎన్నికలు

విశాలాంధ్ర-తిరుపతి: జనవరి 2025 4 5 తేదీలలో జరిగిన నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ టెలికాం ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర మహాసభలు జరిగాయి. తిరుపతి జిల్లాకు సంబంధించిన సర్కిల్ నాయకత్వాన్ని ఎన్నుకోవడం జరిగింది. చిత్తూరు జిల్లాకు ఉపాధ్యక్షులుగా వీరనారాయణ మదనపల్లి ఎస్ శ్రీనివాసులు తిరుపతి మరియు కల్లపూడి గోవిందస్వామి కోఆర్డినేటర్లుగా ఎన్నుకోవడం జరిగినది వారికి ఏఐటియుసి జిల్లా కౌన్సిల్ విప్లవ అభినందనలు తెలియజేసింది.

చౌడేపల్లి వాసి డాక్టర్ మురళీధర్‌కి అవార్డు.. మండల ప్రజల అభినందనలు

విశాలాంధ్ర-చౌడేపల్లి: మలేషియా దేశంలో కౌలాలంపూర్ లోని మలేషియా తెలుగు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాలు భాగంగా పలువురు చిత్తూరు జిల్లా వాసులకు ఘనంగా సత్కరించారు. దేశం సుభిక్షంగా ఉండాలంటే రైతే ప్రధాన కారణమని కనుక మనం రైతులను సత్కరించుకోవడం చాలా ఆనందదాయకమని వారు తెలిపారు. ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్న సంక్రాంతి సంబరాలలో భాగంగా వారు ఈ ఏడు చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గం చౌడేపల్లి కు చెందిన బయోలిక్కర్స్ సృష్టికర్త అధినేత డాక్టర్ బి.ఎస్ అమర్నాథ్ డాక్టర్ మురళీధర్ చౌడేపల్లి కి చెందిన రైతు శ్రీరామ్ గోపాలకు ఘనంగా సత్కరించారు. ఈ ఉత్సవాలలో మలేషియాలో నివసిస్తున్న మలేషియా ఆంధ్ర అసోసియేషన్ వారు అచ్చ తెలుగు కట్టుబట్టలతో పాల్గొని మన సంస్కృతి సాంప్రదాయాలను గౌరవించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి విశాఖ జిల్లా భీమిలి నియోజకవర్గం తెలుగుదేశం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఎలమంచి జనసేన ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ మలేషియా ఇండియన్ హై కమిషన్ ఛాన్సర్ అమృత దాస్ లు పాల్గొన్నారు. కౌలాలంపూర్ లో నివసిస్తున్న మలేషియా ఆంధ్ర అసోసియేషన్ అధ్యక్షుడు బోలిశెట్టి శ్రీరామ్ ఉపాధ్యక్షుడు శ్రీరామ్ జగదీష్ రాయల్, హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ కింద పడి రైతు మృతి

విశాలాంధ్ర-పెనుమూరు: మండలంలోని ఉగ్రాణం పల్లి పంచాయతీ గ్రామం లో రఘునాథ నాయుడు కుమారుడు దామోదర్ నాయుడు ట్రాక్టర్‌తో తన సొంత మామిడి తోట దున్నుతూ అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తాపడంతో రైతు దామోదర్ నాయుడు అక్కడక్కడే మృతి చెందాడు. అనంతరం గ్రామస్తులు తెలుసుకొని వెళ్లేసరికి మృతి చెందినట్లు నిర్ధారించుకున్నారు. ట్రాక్టర్‌ను తొలగించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగిందన్నారు. పెనుమూరు ఏఎస్ఐ మనోహర్ కేసును పరిశీలించి శవాన్ని చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగిందన్నారు. రైతు దామోదర్ నాయుడుకి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. కావున రాష్ట్ర ప్రభుత్వం వారి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుచున్నారు.

ఎమ్మెల్యే సహకారంతో ప్రజా సమస్యలు తీరుస్తా: ఆదిశంకరయ్య

విశాలాంధ్ర-వెంకటగిరి: వెంకటగిరి మున్సిపాలిటీ సుదర్శన్ నగర్ సచివాలయ పరిధిలో ప్రజల సమస్యల మీద గ్రీవెన్స్ జరిగింది. ఇందులో భాగంగా బొగ్గులమెట్ట ధర్మాపురం, నరసింహారావు వీధి ముత్తరాశిపాలెం ప్రజలు తమ సమస్యల మీద సచివాలయం వచ్చి అర్జీలు తెలియజేసినారు. ప్రధానంగా సైడ్ కాలువలు వీధిలైట్లు పారిశుద్ధ్యం సరిగాలేదని అంతేకా కుండా సిసి రోడ్లు తెలియజేశారు. తగు సమస్యలను వెంకటగిరి శాసనసభ్యులైనా కురుగొండ్ల రామకృష్ణ తెలియజేసి తగు సమస్యలను పరిష్కరిస్తానని తెలియచేసినాను. వీటికి సంబం ధించి ప్రజలు ఎటువంటి ఆందోళనకు గురికాకుండా ప్రజలకు ఉన్న సమస్యలను ప్రతి సోమవారం అర్జీలను సచివాలయం నందు సేకరిస్తానని తెలియపరుస్తున్నానని, తగు సమస్యలను వెంకటగిరి శాసనసభ్యులకు తెలియజేసి పరిష్కరి స్తానని ఆది శంకరయ్య తెలియజేశారు.

ప్రమాదంలో గాయపడిన కార్మికులను ఆదుకోండి

వామపక్షాల ఆధ్వర్యంలో తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన

విశాలాంధ్ర-పుత్తూరు: నారాయణవనం మండలంలోని 'లక్కీ4 యు ఎక్మమ్' కంపెనీలో జరిగిన ప్రమాదం వల్ల గాయపడిన కార్మికులను ఆదుకోవాలని సిపిఐ నాయకులు డి.మహేష్, చంద్రబాబు, సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దాసరి జనార్దన్, జిల్లా కమిటీ సభ్యులు ఆర్.వెంకటేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం రాత్రి ఫ్యాక్టరీలో బాయిలర్ గ్యాస్ పైప్ విరగడం వల్ల సంభవించిన ప్రమాదంలో పదిమంది కార్మికులు గాయపడి యాజమాన్యం గుట్టు చప్పుడు కాకుండా పుత్తూరు లోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స అందించి ఇంటికి పంపేశారని వారు విమర్శించారు. సోమవారం నాడు సిపిఎం, సిపిఐ పార్టీల ఆధ్వర్యంలో ఫ్యాక్టరీలో ప్రమాద బాధితులను పరామర్శించి ఫ్యాక్టరీ ఆవరణలో ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం నారాయణవనం తాసిల్దార్ ఆఫీస్ వద్ద నిరసన తెలియజేసి తాసిల్దార్ జయరాములకు వినతి పత్రాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దాసరి జనార్దన్ మాట్లాడుతూ లక్కీ 4 యు ఎగ్జిమమ్ కంపెనీలో కార్మికులకు భద్రత లేదని తెలిపారు. నైపుణ్యం కలిగిన కార్మికులు నిర్వహించాల్సిన పనిని నైపుణ్యం లేని కార్మికులు చేయడం వలన ఈ లాంటి ప్రమాదాలు సంభవించినట్లు కనబడుతున్నదని తెలిపారు. ఫ్యాక్టరీలో పనిచేస్తున్న కార్మికులకు పీఎఫ్ సౌకర్యం ఈఎస్ఐ సౌకర్యం కూడా లేవని ఈ సందర్భంగా తెలిపారు. ఫ్యాక్టరీ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరిగిందని భవిష్యత్తులో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా అధికారులు పర్యవేక్షణ కూడా చేయాలని విజ్ఞప్తి చేశారు. యాజమాన్యం బయట రాష్ట్రాల నుంచి ముఖ్యంగా హిందీ రాష్ట్రాల నుంచి కార్మికులను తీసుకొచ్చి వాళ్లకు భద్రతను గాలికి వదిలేసి వాళ్ళ దగ్గర పెట్టి చాకిరి చేయించుకుంటున్నారని విమర్శించారు. కార్మిక శాఖ అధికారులు కన్నెత్తి చూడకపోవడం దారుణమన్నారు ఫ్యాక్టరీలో వస్తున్న ఉత్పత్తులు ఎందుకు ఉపయోగిస్తారో కూడా అక్కడ అధికారులు చెప్పడం లేదని ఇంత రహస్యంగా ఉత్పత్తులను తయారు చేసి ఎక్కడికి పంపిస్తారో ఎందులో ఉపయోగిస్తారో కూడా తెలియని పరిస్థితి ఉందని తెలిపారు. వలస కార్మికుల చట్టాన్ని అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించి కార్మికులకు రక్షణ ఏర్పాట్లు కూడా కల్పించాలని కార్మికులకు అందరికీ పిఎఫ్ ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఫ్యాక్టరీలో స్థానికులకు 75 శాతం అవకాశాలు కల్పించాలని జీవో ఉన్నా కూడా యాజమాన్యం పట్టించుకోకుండా తనకు నచ్చిన వారిని మాత్రమే తీసుకోవడం దారుణం అన్నారు. స్థానికులు అందరికీ కూడా ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నారాయణ మండల కార్యదర్శి ఆర్.ముని శంకర్, పిచ్చాటూరు కార్యదర్శి రామచంద్రారెడ్డి, నారాయణవనం నాయకులు సుబ్రహ్మణ్యం పిలై గిరి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధిలో ఎస్ఎంసి సభ్యులదే ప్రధాన భూమిక

విశాలాంధ్ర-సత్యవేడు: పాఠశాలలు అభివృద్ధిలో ఎస్ఎంసి కమిటీ సభ్యులదే ప్రధాన భూమిక అని స్థానిక జ్యోతిరావు పూలే బాలుర గురుకుల పాఠశాల ప్రధాన ఆచార్యులు సత్యనారాయణ చెప్పారు. సోమవారం ఎస్ఎంసి కమిటీ చైర్మన్ సురేష్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులకు ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గురుకుల ప్రధానాచార్యులు సత్యనారాయణ మాట్లాడుతూ గురుకుల అభివృద్ధికి సంబంధించి ప్రణాళిక తయారీ, వాటిని అమలు చేయుటలో పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులదే కీలకపాత్ర అన్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం నిధులు సౌలభ్యం అనుసరించి అభివృద్ధిని చేయాల్సి ఉందన్నారు. ఈ నేపథ్యంలో కమిటీ సభ్యుల విధులు వారి బాధ్యతలను ఆయన వివరించారు. ఎస్ఎంసి చైర్మన్ సురేష్ మాట్లాడుతూ గురుకుల పాఠశాల అభివృద్ధి చెందాలంటే ఆర్థిక ప్రణాళిక అవసరమన్నారు. అభివృద్ధి పరంగా ఏ పని చేపట్టిన నాణ్యతగా ఉండాలన్నారు. ముఖ్యంగా పనులపై సంబంధిత ఇంజనీర్లు కూడా పర్యవేక్షించాల్సిన బాధ్యత ఉందన్నారు. క్వాలిటీలో ఎలాంటి రాజీ లేకుండా చూడాల్సిన బాధ్యత కమిటీ సభ్యులపై ఉందని గుర్తు చేశారు. తదనంతరం పాఠశాల ఆవరణలో కమిటీ సభ్యులు పనస వంటి మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసి ఉప చైర్మన్ శిరీష, మణికంఠ, వైస్ ప్రిన్సిపాల్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పదోతరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

విశాలాంధ్ర-చిల్లకూరు: మండల పరిధి లోని పారిచెర్లవారి పాళెం జిల్లా ప్రజాపరిషత్ ఉన్నతపాఠశాలలో పదవతరగతి విద్యార్థులకు సోమవారం, కో-ఆప్షన్ సభ్యులు వెలగపూడి ప్రదీప్ కుమార్ సహకారంతో తెలుగు మరియు ఇంగ్లీషు సబ్జెక్టులలో అవగాహన పెంపొందించేందుకు స్టడీ మెటీరియల్ అందచేసారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు బి. సుధాకర్ మాట్లాడుతూ విద్యార్థులు అన్ని సబ్జెక్టు లలో సమగ్రమైన అవగాహన కలిగిఉండాలన్నారు. ఎలాంటి సందేహాలు ఉన్నా ఆయా సబ్జెక్టుకు సంబంధించిన ఉపాధ్యాయులను అడిగి తమ సందేహాలకు సమాధానాలు తెలుసుకోవాలని సూచించారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు అందుబాటులో ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ షకీలా, గ్రామ పెద్ద సుబ్రహ్మణ్యం నాయుడు, ఉపాధ్యాయులు చంద్ర, చంద్రశేఖర్, మాధవయ్య, ప్రజేంద్రరెడ్డి, నాగభూషణమ్మ, సురేంద్ర, విద్యాకమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల పిల్లలకు ఆరోగ్య పరీక్షలు

విశాలాంధ్ర-చౌడేపల్లి: మండలంలోని గడ్డ మర్రిపల్లి ఎంపీపీ స్కూల్ నందు 36 పిల్లలకు రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమంలో భాగంగా పరీక్షించి, తగిన మందులు వైద్య సలహాలు ఇవ్వడం జరిగింది. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత. దోమల ద్వారా వచ్చు 5 రకాల జ్వరాలు మలేరియా, డెంగీ, చికెంగున్య, మెదడు వాపు, బోదకాలు, ఈగల ద్వారా వచ్చు 3 రకాల జబ్బులు టైఫాయిడ్, డయేరియా, కామర్లు గురించి చెప్పారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పరిశీలించారు. అంగన్వాడీ సెంటర్ విజిట్ చేసారు మరియు 104 సేవలు అందించారు. ఉపకేంద్ర ఆవరణలో పిచ్చిమొక్కలు తొలగించారు.

ఏఎస్ఐ మహేంద్ర పై చర్యలు చేపట్టాలి

విశాలాంధ్ర-పుంగనూరు: మండలంలోని నల్లగుంట్ల పల్లి తాండాకు చెందిన మురళికి వారి అక్క లీలావతికి ఆర్థిక లావాదేవీల విషయంపై ఇరువురు ఘర్షణ పడడంతో అక్క లీలావతి పట్టణం లోని పోలీస్ స్టేషన్ నందు వారి తమ్ముడు మురళి పై పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ ఫిర్యాదుల భాగంగా ఏఎస్ఐ మహేందర్ మురళిని పుంగనూరు పోలీస్ స్టేషన్ కు పిలిపించి ఘర్షణ అంశంపై మాట్లాడుతూ మురళిని ఇష్టమొచ్చినట్లు కులం పేరుతో దూషించారని అలాగే నన్ను వ్యక్తిగతంగా బూతులు మాట్లాడి నా కూతురు నా వెంట ఉన్నప్పుడు నాకు అవమానం చేశారని పేర్కొంటూ సోమవారం పట్టణంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం ఎదుట తన కూతురితో పాటు నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది. తలను నేలకు రాకుతూ ఎస్సై మహేందర్ ను సస్పెండ్ చేయాలని లేనిపక్షంలోఆత్మహత్య చేసుకుంటానని హెచ్చరించడం జరిగింది. విషయం తెలుసుకున్న సిఐ శ్రీనివాసులు సంఘటన స్థలానికి చేరుకొని బాధితుడు మురళికి న్యాయం చేస్తానని హామీ ఇవ్వడంతో నిరసన కార్యక్రమాన్ని విరమించి పోలీస్ స్టేషన్‌కు వెళ్లిపోవడం జరిగింది.

డాక్టరేట్ పొందిన ఎంసివి డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్‌కు సన్మానం

విశాలాంధ్ర-పుంగనూరు: పట్టణంలోని ఎంసివి డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న జి.రామకృష్ణ గత 25 సంవత్సరాలుగా విద్యా వ్యవస్థలో సేవలు అందించినందుకు గాను భారత్ వర్చువల్ యూనివర్సిటీ ఫర్ పీస్ అండ్ ఎడ్యుకేషన్ బెంగళూరు ఇన్‌యూఎన్ఓ జెనీవా వారిచే డాక్టరేట్ మరియు లైఫ్ టైం అచీవ్మెంట్ అవార్డును ప్రధానం చేయడంతో పట్టణంలోని ఏపీజే అబ్దుల్ కలాం హెల్త్ ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ అయూబ్ ఖాన్ సంకల్ప సొసైటీ సభ్యులు రాజు ఆధ్వర్యంలో ఆయనను సోమవారం రోజున ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత రామకృష్ణ మాట్లాడుతూ నన్ను సన్మానించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు అన్నారు. సేవా కార్యక్రమాలు చేపట్టడంతో పాటు ముఖ్యంగా విద్యార్థులను ప్రథమ స్థానంలో నిలపడం కొరకు నా శక్తివంచన లేకుండా పనిచేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

ఏఎస్ఐ మహేందర్‌ను సస్పెండ్ చేయాలి

ఎస్సీ ఎస్టీ జిల్లా మహానటరింగ్ కమిటీ సభ్యులు

విశాలాంధ్ర-పుంగనూరు: చిత్తూరు జిల్లా, పుంగనూరు మండలం నల్లగుట్లపల్లి తాండ బాణావత్ మురళి నాయక్ ను ఏఎస్ఐ మహేందర్ రావు గిరిజన కులం పేరుతో దూషించుటతోపాటు బండబూతులు తిట్టడం బాధితుడు తీసిన వీడియో రాష్ట్రవ్యాప్తంగా వైరల్ అవడంతో చిత్తూరు జిల్లా ఎస్సీ ఎస్టీ నిఘా మరియు పర్యవేక్షణ కమిటీ సభ్యులు డాక్టర్ బాణావత్ మునీంద్ర నాయక్ పుంగనూరు ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ నందు బాధితుడు మురళి నాయక్ కలిసి వివరాలు తీసుకోవడం జరిగినది. ముఖ్యంగా మురళి నాయక్ మరియు ఏఎస్ఐ మహేందర్ మధ్య జరిగిన సంభాషణ వివరాలు విచారించడం జరిగినది. మురళి నాయక్ మాట్లాడుతూ నన్ను గిరిజన కులానికి చెందిన వ్యక్తిగా అనేక అనరాని మాటలు నాకు తిట్టినాడు అని తెలిపారు అదేవిధంగా వారి కుమార్తె కూడా అక్కడ జరిగిన సంఘటన మొత్తం కమిటీ సభ్యుల ముందు తెలియజేయడం జరిగినది. వారి యొక్క ముఖ్య డిమాండ్ అతన్ని సస్పెండ్ చేయమని మరియు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టాలని వారు డిమాండ్ చేయడం జరిగినది. ఈ వివరాలు అన్ని సేకరించి చిత్తూరు జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, దృష్టికి తీసుకువెళ్లి బాధితుడికి న్యాయం జరగాలని గిరిజన సంఘ నాయకులు డిమాండ్ చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ బాణావతి మునీంద్ర నాయక్, గిరిజన సంక్షేమ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు కే. హరిశివప్ప, సంత్ సేవాలాల్ మహారాజ్ సొసైటీ ప్రధాన కార్యదర్శి ఎం.రెడ్డి నాయక్, సభ్యులు శంకర్ నాయక్ రవీంద్రనాయక్ శివాజీ నాయక్ బాలాజీ నాయక్ శ్రీరాములు నాయక్, ఉమామహేశ్వర్ రావు, హరి మరియు గిరిజన నాయకులు పాల్గొన్నారు.

11న చిత్తూరులో ఘనంగా వడ్డే ఓబన్న జయంతి వేడుకలు

విశాలాంధ్ర-చిత్తూరు: జిల్లా కేంద్రమైన చిత్తూరు నగరంలో ఈనెల 11 తేదీన వడ్డే ఓబన్న జయంతిని ఘనంగా నిర్వహించనున్నట్లు కార్యక్రమ ఆహ్వాన కమిటీ నాయకులు రవీంద్రరాజు తెలిపారు. చిత్తూరు ప్రెస్ క్లబ్‌లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చిత్తూరు నాగయ్య కళాక్షేత్రంలో వడ్డే ఓబన్న జయంతి సభ నిర్వహిస్తామన్నారు. ముందుగా గాంధీ విగ్రహ కూడలి నుంచి భారీ ర్యాలీ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ సభకు ప్రజాప్రతినిధులు, వడ్డెర సంఘం రాష్ట్ర ముఖ్య నాయకులు హాజరుకానున్నట్లు వెల్లడించారు. తెలంగాణ తరహాలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం వడ్డే ఓబన్న జయంతిని అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఆర్థికంగా వెనుకబాటులో ఉన్న తమను పక్క రాష్ట్రాల్లో మాదిరిగా వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలని విన్నవించారు. కులవృత్తుల వారికి పనిముట్లు, యంత్రాలకు నిధులు మంజూరు చేస్తే తమకు ఉపయోగకరంగా ఉంటుందని ప్రభుత్వానికి విన్నవించారు. ఈ సమావేశంలో ఆహ్వాన కమిటీ సభ్యులు ధరణి ప్రకాష్, గుర్రప్ప, మురళి, బోడబండ్ల అశోక్, మణికంఠ, బాబు, హరిబాబు, సంజీవి, సుధాకర్ పాల్గొన్నారు.

అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు పంపిణీ చేయాలి

విశాలాంధ్ర-సూళ్లూరు పేట: అర్హులైన నిరుపేదలందరికీ గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్లు ఇంటి స్థలం, పట్టణ ప్రాంతంలో రెండు సెంట్లు ఇంటి స్థలం ఇవ్వాలని సిపిఐ సూళ్లూరుపేట నియోజకవర్గ కార్యదర్శి కామ్రేడ్ సి.సుధాకర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో గత ప్రభుత్వం ఇంటి స్థలం లేని నిరుపేదలకు పట్టణ ప్రాంతాలలో ఒక్క సెంటు, గ్రామీణ ప్రాంతాలలో ఒకటిన్నర సెంటు ఇవ్వడం జరిగింది. అనాడే భారత కమ్యూనిస్టు పార్టీ ఆ స్థలం నివాసయోగం కాదని తెలియజేసి నిరసన తెలియపరిచిందని ఆయన అన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి ఎన్నికల సందర్భంగా పట్టణాల నిరుపేదలకు రెండు సెంట్ల ఇంటి స్థలం, గ్రామీణ ప్రాంత నిరుపేదలకు మూడు సెంట్లు స్థలం ఇస్తానని తమ ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచారని. అయితే ప్రభుత్వం వచ్చి ఈనాటికే అది అమలు కాకపోవడంతో విధిలేని పరిస్థితిలో భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర నాయకత్వం గత కొంతకాలంగాపై ఇంటి స్థలాల సమస్యల సాధన కొరకు సుదీర్ఘమైన కార్యాచరణ తీసుకొని అనేక కార్యక్రమాలు చేసి రాష్ట్రవ్యాప్తంగా పోరాడుచున్నది. దీనిలో భాగంగా ఈ దినం సూళ్లూరుపేట నియోజకవర్గంలోని నిరుపేదలతో ఆర్డిఓ కార్యాలయం వద్ద భారత కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో ధర్నా నిర్వహించి వ్యక్తిగతంగా అర్జీలు ఆర్డిఓకు సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా విశాలాంధ్ర 2025 క్యాలెండరును సిపిఐ నాయకులు మోదుగుల పార్థసారథి సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయికి అందజేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మోదుగుల పార్థసారథి, మోదుగుల. రమణయ్య, జిల్లా సమితి సభ్యులు కే.శ్రీనివాసులు, వి.ప్రభుదాస్, ఓ.కుమార్, నియోజకవర్గ సమితి సభ్యులు పి.లక్ష్మమ్మ, టి.సూర్య, వి.వెంకటకృష్ణయ్య, సిహెచ్.బాలు పాల్గొన్నారు.

ఎస్బిఐ మేనేజర్ ఆధ్వర్యంలో అన్నదానం

విశాలాంధ్ర-కార్వేటినగరం: కీ.శే. పద్మశ్రీ అవార్డు గ్రహీత మణిరత్నం జయంతి సందర్భంగా వృద్ధాశ్రమం నందు కార్వేటి నగరం ఎస్‌బిఐ మేనేజర్ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం అన్నదానం, పండ్లు, స్వీట్లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక సేవా కార్యక్రమాలు ఏర్పాటు చేసి ఎవరు లేని సేవలు చేసి పద్మశ్రీ అవార్డు సేవా తత్వం నిరాడంబర జీవన విధానం కలిగిన గొప్ప మహనీయుడిని కొనియాడారు. ఆయన ప్రస్తుతం మన మధ్య లేకపోయినప్పటికీ అనేక సేవలు చేసి పేదవారి హృదయాలలో జీవిస్తున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం అనేకమంది రాస్ ద్వారా ఉపాధి పొందుతున్నారన్నారు. సూపర్వైజర్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కుల ఆడిట్ మార్పులు చేర్పులు కోసం నేడే చివరి రోజు

విశాలాంధ్ర-పుత్తూరు: కుల ఆడిట్ మార్పులు చేర్పులు కోసం నేడే చివరి రోజు ఎస్సీకి సంబంధించిన దళితులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మార్పీఎస్ తిరుపతి జిల్లా కార్యదర్శి మునివేలు తెలిపారు. ఎస్సీ వర్గీకరణలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టినటువంటి కుల ఆడిట్ కులగణ సర్వే లిస్ట్‌ను గ్రామాలలోని సచివాలయంలో ఉంచడం జరిగింది. కులాలలో ఏదైనా మార్పులు చేర్పులు చేసుకునే అవకాశం 31.12.2024 వరకు ఉండగా పల్లెల్లో ఎక్కువ సమస్యలు ఉన్నందువలన ప్రభుత్వం ఈనెల 7 వరకు గడువు ఇచ్చింది చివరి లిస్టును ఈ నెల 17వ తేదీ న విడుదల చేస్తుంది కాబట్టి సద్వినియోగం చేసుకునే వాళ్ళు రేపు చివరి అవకాశం గా తెలియజేయడం జరిగింది ఇందులో భాగంగానే పరమేశ్వర మంగళమ్ గ్రామంలో కుటుంబానికి చెందిన వారికి వేరు వేరుగా కుల ధ్రువీకరణ పత్రాలు, మరియు ఒకే ఇంటిపేరు ఒకే కులానికి చెందిన వారికి కుల ఆడిట్ లో వివిధ రకాలుగా కులాలుగా కుల ఆడిట్ లిస్టు లో రావడం జరిగింది తప్పులుగ ఉన్న వాటిని పరిశీలించి విచారించి మార్పాలని ఎమ్మార్వో కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది.

నేటి తరానికి మన సంస్కృతి సాంప్రదాయాలు ఎంతో అవసరం

విశాలాంధ్ర-పెద్దపంజాణి: మండలంలోని తులసమ్మ గుడి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించినట్లు తెలిపారు విద్యార్థులు తమ భవిష్యత్తులో మన యొక్క సంస్కృతిని సాంప్రదాయాలను రేపటి తరాలకు అందించడానికి ఈ ముందస్తు వేడుకలు ఎంతగానో ఉపయోగంగా ఉంటాయని పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్ పర్సన్ మాధవి తెలిపారు. మన తెలుగు పండుగలు విశిష్టతను తెలుసుకోవడానికి విద్యార్థులకు ఈ వేడుకలు ఎంతగానో ఉపయోగంగా ఉన్నాయని ప్రధానోపాధ్యాయులు హరిప్రసాద్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల ప్రాంగణంలో రంగవల్లులు వేయించి భోగి మంటలు వేయిం చారు అలాగే విద్యార్థులు హరిదాసుల వేషధారణలో అలరిం చారు. ఈ కార్యక్రమంలో పాఠశాలకు నూతనంగా ఎన్నికైన తల్లిదండ్రుల కమిటీ సభ్యులకు ప్రధానోపాధ్యాయులు మరియు చైర్మన్ ఆధ్వర్యంలో శిక్షణను ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రషీద్ అహ్మద్, సురేంద్ర తల్లిదండ్రుల కమిటీ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు

జిల్లాలో 15,68,788 మంది ఓటర్లు

మహిళా ఓటర్లే అధిక్యం

విశాలాంధ్ర-చిత్తూరు: జిల్లాలో మొత్తం 15,68,788 మంది ఓటర్లు ఉన్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఓటర్ల జాబితాను సోమవారం విడుదల చేశారు. జిల్లాలో పురుష ఓటర్ల కన్నా మహిళా ఓటర్ల ఎక్కువగా ఉన్నారు. జిల్లాలో అత్యధికంగా పలమనేరు నియోజకవర్గంలో 2,69,065 మంది ఓటర్లు ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా మహిళా ఓటర్లు 7,96,637 మంది ఉండగా, పురుష ఓటర్లు 7,72,079 మంది ఇతరులు 72 మంది ఉన్నారు. పుంగనూరు నియోజకవర్గం లో మొత్తం 2,39,148 మంది, నగిరిలో 2,02,709, గంగాధర నెల్లూరులో 2,05,623, చిత్తూరులో 2,03,570, పూతలపట్టు లో 2,21,638, కుప్పంలో 2,27,034 మంది ఓటర్లు ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు. ఇందులో సర్వీస్ ఓటర్లు 3,260, యువత ఓటర్లు 20,446 మంది ఉన్నట్లు తెలిపారు.

దెబ్బలు తిన్న దళితులను రిమాండ్‌కు పంపడం దుర్మార్గం

విశాలాంధ్ర-పెద్దపంజాణి: అగ్ర వర్ణాలు చేతులో దెబ్బలు తిని చికిత్స పొందుతున్న దళితులను రిమాండ్ కు పంపడం చాలా దుర్మార్గమని జాతీయ మానవ హక్కులు అవినీతి నిర్మూలన సంస్థ, మాల మహానాడు, జై భీమ్ సంఘం, బిల్డింగ్ అసోసియేషన్ నాయకులు సోమవారం తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా సోమవారం పెద్దపంజాణి మండలం కేంద్రంలో తిప్పన్న అధ్యక్షతన నగిరి నియోజకవర్గం తడుకు పేటలో దళితులపై అగ్రవర్ణాల వారు చేసిన దాడికి నిరసనగా రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మానవ హక్కుల సంస్థ జిల్లా అధ్యక్షులు డి.వి.మునిరత్నం, పార్థసారథి, మాల మహానాడు మండల నాయకుడు తిప్పన్న మాట్లాడుతూ అగ్ర కులస్తుల చేతులో గాయాలైన దళితులను అరెస్ట్ చేసినప్పుడు దళితులపై దాడి చేసి గాయపరిచిన అగ్రకులస్తులను పోలీసులు ఎందుకు అరెస్టు చేయలేదో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. దళితులను గ్రామం వదిలి వెళ్లిపోవాలని ఆదేశించే అధికారం అగ్ర కులస్తులకు ఎవరు ఇచ్చారని నిలదీశారు. ప్రభుత్వం అధికారంలో ఉందని ప్రజలు, దళితులపై పెత్తనం చలాయిస్తుంటే పోలీసులు చోద్యం చూస్తూ ఉండడం సరికాదని హితవు పలికారు. గొడవలు సద్దుమణిగిన అగ్ర కులస్తులు కక్ష సాధింపు చర్యలతో చిన్నపిల్లలను సైతం స్కూలుకు పోనివ్వకుండా, గుడిలోకి రానివ్వకుండా మహిళలను అవమానపరచడం సిగ్గుచేటు అన్నారు. అమర నారాయణ, టి.మునిరత్నం మాట్లాడుతూ ఈ విషయం పైన పోలీస్ అధికారులు నిష్పక్షపాతంగా దర్యాప్తు చేసి దళితులపై దాడి చేసిన అగ్ర కులస్తులపై చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని కోరారు. దేశవ్యాప్తంగా ఎక్కడ కూడా దళితులు అగ్రకులస్తులపై దాడి చేసిన సందర్భాలు లేవని దళితులే దెబ్బలు తింటూ అవమానాలకు గురవుతున్న విషయం నగ్నమెరిగిన సత్యం అన్నారు. ఇటువంటి అనాగరికమైన చర్యను స్థానిక ఎమ్మెల్యే తో పాటు దళిత ఎమ్మెల్యేలు, అధికార పార్టీలో కొనసాగుతున్న దళిత నాయకులు మూసుకుని తొలగించి బహిరంగంగా ఖండించి మీ నిజాయితీ నిరూపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సాంబశివ, ఆనంద, చంద్రమౌళి, సుబ్రహ్మణ్యం, రెడ్డప్ప, చంద్ర, మునిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి

ఎంఈఓ విజయ్ కుమార్

విశాలాంధ్ర-కార్వేటినగరం: ఉపాధ్యాయులు సమయపాలన విధిగా పాటించాలని మండల విద్యాశాఖ అధికారి ఎం. విజయ కుమార్ అన్నారు. సోమవారం ఆ సంఘం నాయకులు ఆధ్వర్యం లో క్యాలెండర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ఉపాధ్యాయులు విధి నిర్వహణలో సమయపాలన తప్పక పాటించాలని విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. అనంతరం పిఆర్‌టియు రాష్ట్ర కార్యదర్శి జోగి గురుమూర్తి మాట్లాడుతూ పిఆర్‌టియు సంగం ఉపాధ్యాయులు హక్కులు బాధ్యతలను రెండు కండ్లుగా ఉపాధ్యాయుల సంక్షేమానికి కృషి చేస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌టియు మండల అధ్యక్షురాలు ముని లక్ష్మి, ప్రధాన కార్యదర్శి వెంకటరత్నం, జిల్లా నాయకులు దామోదరం కళ్యాణ్ కుమార్ పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చంద్రగిరి మండల గ్రామ రెవెన్యూ అధికారులు ఏకగ్రీవ ఎన్నిక

విశాలాంధ్ర-చంద్రగిరి: తిరుపతి జిల్లా, తిరుపతి రెవెన్యూ డివిజన్, చంద్రగిరి మండల గ్రామ రెవెన్యూ అధికారులు సంఘం ఎన్నికలు సోమవారం జరిగాయి. ఈ ఎన్నికల్లో అధ్యక్షులుగా కె.సిద్దయ్య, ఉపాధ్యక్షులుగా పి.విష్ణువర్ధన్, కార్యదర్శిగా కె.యజ్ఞశ్రీ, సంయుక్త కార్యదర్శిగా ఎన్.గిరి, కోశాధికారిగా బి రెడ్డి ప్రసాద్ ను గ్రామ రెవెన్యూ అధికారులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏకగ్రీవంగా ఎన్నుకోబడిన నాయకులు తమను ఏకగ్రీవంగా ఎన్నుకున్న సహ గ్రామ రెవెన్యూ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ రెవెన్యూ అధికారుల సమస్యలను పరిష్కరించేందుకు అహర్నిశలు తమ వంతు కృషి చేస్తామని వారు తెలిపారు.

పిఆర్‌డియు డైరీ క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-పుత్తూరు: నారాయణవరం మండలం విద్యాశాఖ కార్యాలయం నందు పుత్తూరు డివిజన్ విద్యాశాఖ అధికారి హెచ్. ప్రభాకర్ రాజు నారాయణ వనం మండలం విద్యాశాఖ అధికారి డి.జనార్దన్ రాజు చేతులమీదుగా పిఆర్టియు డైరీ మరియు క్యాలెండర్ లను తిరుపతి జిల్లా పిఆర్టియు ప్రధాన కార్యదర్శి టి.సదాశివన్ సమక్షంలో ఆవిష్కరించడం జరిగింది మరియు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో నారాయణవనం మండలం విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ విద్యాశాఖకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి అందరూ కలిసి ఐక్యంగా పనిచేద్దామని సూచన చేశారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌టియు నారాయణవనం మండలం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి.ప్రసాద్, ఎస్ఎస్ జానకి రామన్, రాష్ట్ర కౌన్సిలర్ ఏ.మణిగండన్, మహిళా విభాగ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పర్వీన్ బేగం, జీవిత మరియు జిపి భారతి, రేవతి, శరణ్య ఇతర ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ 2వ సెమిస్టర్‌లో ఆక్స్‌ఫర్డ్ డిగ్రీ కళాశాల విద్యార్థుల ర్యాంకుల ప్రభంజనం

J SINDHU PRIYA, P CHAMUNDESWARI, E RAJESWARI, P CHARAN, SK MASEERA TAJ, K LIKITHA, P GIRISH KUMAR, K HARSHITHA, P UPENDRA, K THENMOZHI, R RAVI TEJA, P HASEEFA, S CHAITHANYA, B SUCHITRA, P HARIKA, G TEJASWINI, K PAVANI

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: ఎస్వీయూనివర్సిటీ సోమవారం విడుదల చేసిన డిగ్రీ 2వ సెమిస్టరు ఫలితాలలో ఆక్స్‌ఫర్డ్ డిగ్రీ కళాశాల విద్యార్థులు పట్టణ, యూనివర్సిటీ స్థాయిలో అన్నిగ్రూపులలో అగ్ర స్థానాలను కైవసం చేసుకున్నారని కళాశాల కరస్పాండెంట్ సి.మధుసూదన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన అభినందన కార్యక్రమంలో మాట్లాడుతూ బి.ఎస్సీ (భౌతిక శాస్త్రం)గ్రూపులో కే హర్షిత(8.92), పి ఉపేంద్ర(8.55), కే తేనేమోజి (8.28) ఆర్ రవితేజ(8.28) %డ% ఎస్ చైతన్య(8.28), బి.ఎస్సీ (సాంఖ్యాకశాస్త్రము)గ్రూపులో బి. సుచిత్ర (9.21), పి హరిక (8.94) %డ% జీ తేజస్విని (8.11), బి.ఎస్సీ(బయోటెక్నాలజీ) గ్రూపులో కే పావని (9.01), కే లిఖిత (8.82) %డ% పి హసీఫా (8.59) పాయింట్లతో యూనివర్సిటీ స్థాయిలో వరుసగా ప్రథమ ద్వితీయ, తృతీయస్థానాన్ని కైవసం చేసుకున్నారని ఆనందం వ్యక్తం చేశారు. బి.కామ్ (సి.ఏ) గ్రూపునందు జె.సింధు ప్రియా (8.68), పి.చాముండేశ్వరి(8.68), ఇ.రాజేశ్వరి(8.43), పి.చరణ్(8.08), పి.గిరీష్ కుమార్(8.08), ఎస్.కె.మసీరా తాజ్(8.08) పాయింట్లతో పట్టణ, యూనివర్సిటీ స్థాయిలో వరుసగా ప్రథమ ద్వితీయ, తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారన్నారు. అభినందన కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ సి.మధుసూదన్ రెడ్డి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొని విద్యార్థులను అభినందించారు.

చేనిగుంట గ్రామంలో బంగారం చోరీ

విశాలాంధ్ర-తడ: మండల పరిధిలోని చేనిగుంట గ్రామంలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని యువకులు తాళం వేసివున్న ఇంటిలో ఇంటితాలాలు పగులగొట్టి సుమారు రెండు సవర్ల బంగారం చోరీ చేసుకుని వెళ్లిన సంఘటన చోటు చేసుకుంది. తడ పోలీసుల సమాచారం మేరకు చేనిగుంట గ్రామానికి చెందిన కొమ్మల రవి,జ్యోతి నివాసిస్తుండగా రవి భార్య జ్యోతి మాల వేసుకుని తీర్థయాత్రలకు వెళ్ళగా రవి ఆదివారం రాత్రి నైట్ డ్యూటీ కి వెళ్ళగా గుర్తు తెలియని యువకులు ఇంటి తాళాలు పగులగొట్టి ఇంటి అలమారా లోని బట్టల క్రింద దాచి ఉంచిన సుమారు రెండు సవర్ల బంగారం చోరీ చేశారని సోమవారం ఉదయం ఇంటికి చేరుకున్న రవి ఇంటి తాళాలు పగుల గొట్టి ఉండటాన్ని గుర్తించి ఇంటిలోకి వెళ్లి పరిశీలించగా బంగారం చోరీకి గురైనట్లు తెలుసుకుని తడ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తడ ఎస్ఐ కొండపనాయుడు పేర్కొన్నారు.

తిరుమల నిత్యాన్నదాన సత్రానికి పది టన్నుల కూరగాయలు తరలింపు

విశాలాంధ్ర-పలమనేరు: కర్ణాటక రాష్ట్రం చిక్కబల్లాపూర్ తాలూకా బాగేపల్లి లోని కృష్ణప్ప వెంకటేశ్వర స్వామి భక్తుడు అన్నదాన సత్రానికి పది టన్నుల కూరగాయలను తన సొంత నిధులతో కొని శ్రీవారి సేవకుడు రవీంద్ర రెడ్డి ఆధ్వర్యంలో దేవస్థానం వారి వాహనంలో సోమవారం తరలించారు. ఈ సందర్భంగా భక్తులు కృష్ణప్ప మాట్లాడుతూ స్వామివారి భక్తులకు అన్న సంతర్పణ చేయడంలో తనకు అవకాశం ఇచ్చినందుకు తమపై దయ ఉన్నదని భావించి ఈ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. శ్రీవారి సేవకుడు రవీంద్రారెడ్డి మిత్ర బృందం సోమశేఖర్ నాయుడు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

మామిడి సస్యరక్షణ పై రైతులకు అవగాహన సదస్సు

విశాలాంధ్ర-రామచంద్రపురం: మండలంలోని సికే పల్లి గ్రామపంచాయతీ రైతు సేవ కేంద్రం లో సోమవారం మామిడి సస్యరక్షణ చర్యలపై రైతులకి శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో రాస్ ఉద్యాన శాస్త్రవేత్త సుధాకర్ మాట్లాడుతూ మామిడి సస్యరక్షణ పై పలు సూచనలు చేసారు అధిక వర్షాలు పొడడం వాళ్ళ మామిడి పూత రావడం ఆలస్యం అవుతుంది కాబట్టి రైతులు తేలికపాటి దుక్కులు చేసుకొని, 13.0.45 (మల్టీ కే) 10 మరియు ఫార్ములా – 4 ను 3 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయడం వలన పూత ఒకేసారి వచ్చే అవకాశం ఉంటుందన్నారు. ఉద్యాన అధికారి సునీల్ మాట్లాడుతూ ప్రభుత్వ రాయితీ మీద మామిడి పండ్ల కవర్లను ఇస్తుందిని, రైతులు దగరలోని రైతు సేవ కేంద్రాల్లో సంప్రదించాలని కోరారు. ఒక రైతుకు 10,000 కవర్లకు గాను 10,000 రూపాయలు రాయితీ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సుకన్య, రైతులు పాల్గొన్నారు.

చంద్రబాబునాయుడుకు ఘన స్వాగతం

విశాలాంధ్ర-తిరుపతి: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మూడు రోజులు పర్యటన నిమిత్తం సోమవారం కుప్పంకు రాక సందర్భంగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కలవడం జరిగింది. ఏం శ్రీధర్ ఎలా ఉన్నావ్ అని భుజం తోడుతూ తగిన గుర్తింపు ఉంటుందని తెలియజేయడం జరిగింది. దీంతో శ్రీధర్ వర్మ మీ ఆశీస్సులు ఎప్పుడూ మా కుటుంబానికి ఉంటుందని తన మనోభావాన్ని తెలియజేశారు. పార్టీలో కష్టపడినందుకు ఫలితం వస్తుందని శ్రీధర్ వర్మ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు నరసింహ యాదవ్, తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జనసేనదే భవిష్యత్: ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

విశాలాంధ్ర-తిరుపతి: జనసేన పార్టీ తిరుపతిలో బలోపేతం చేయడమే లక్ష్యంగా డివిజన్ కమిటీలను ఏర్పాటు చేసేందుకు శ్రీకారం చుట్టినట్లు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చెప్పారు. సోమవారం ఉదయం ఓ హోటల్ లో జనసేన ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో డివిజన్ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, సంయుక్త కార్యదర్శులు, ఎన్నికల ముందు జనసేనలో చేరిన నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ నగరంలోని యాభై డివిజన్ లలో పార్టీని పటిష్టం చేస్తామన్నారు. సంక్రాంతి తరువాత డివిజన్ ల వారీగా పర్యటించి డివిజన్ కమిటీల నాయకులతో కలిసి ప్రజల సమస్యల పరిష్కారానికి శ్రీకారం చుట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. కార్పోరేషన్ ఎన్నికలు ఏడాదిలో వచ్చే అవకాశం ఉన్నందున ఆ సమయానికి జనసేన అన్నివిధాల సిద్ధంగా ఉండేలా తయారు చేస్తామని ఆయన చెప్పారు. గత ఎన్నికల్లో వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎన్డీఏ కూటమి నాయకులను నామినేషన్ లు కూడా వేయనీయకుండా అడ్డుకుని అప్రజాస్వామికంగా ఏకగ్రీవం చేసుకుందని ఆయన ఆరోపించారు. రానున్న కార్పోరేషన్ ఎన్నికల్లో ప్రజాబలంతో ఎన్డీఏ కూటమి విజయదుందుభి మోగించడం ఖాయమని ఆయన తెలిపారు. ఏ పార్టీకి ఎన్ని సీట్లు అనేది ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ , రాష్ట్ర బిజెపి అధ్యక్షులు నిర్ణయిస్తారని ఆయన చెప్పారు. ఆ మేరకు కూటమి సమిష్టిగా ఎన్నికల్లో నిలబడి వైసిపిపై విజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. జనసేన కార్యకర్తలు, నాయకులకు ఏ చిన్న కష్టం వచ్చినా ఆదుకునేందుకు తాను ముందుండనట్లు ఆయన చెప్పారు. గత ప్రభుత్వంలో జనసైనికులుపై పెట్టిన కేసుల వివరాలు తెలిపితే న్యాయపరంగా వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు ఆయన చెప్పారు. ఈ సమావేశంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు డాక్టర్ హరి ప్రసాద్, పార్లమెంట్ పరిశీలకులు వెంకటేశ్వర్లు, ఆరణి శివ, ఆరణి మదన్, రాష్ట్ర కార్యదర్శి ఆకేపాటి సుభాషిణి, అధికారప్రతినిధి కీర్తన, రాయలసీమ కోఆర్డినేటర్ ఆకుల వనజ, కిరణ్ రాయల్, రాజా రెడ్డి, కార్పోరేటర్లు సికె రేవతి, కల్పనా యాదవ్, వరికుంట్ల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుళ్ల ఎంపిక ప్రక్రియలో ఆరో రోజు పరీక్షలు

విశాలాంధ్ర-చిత్తూరు: స్టైపండరీ కేడెట్ ట్రైనీ పోలీసు కానిస్టేబుళ్ల దేహ దారుఢ్య మరియు సామర్థ్య పరీక్షలు చిత్తూరు జిల్లా పోలీసు ట్రైనింగ్ సెంటర్ మైదానంలో ఆరవ రోజు కూడా పకడ్బందీగా కొనసాగాయి. ఆరవ రోజు 609 మంది అభ్యర్థులకు గాను 399 మంది హాజరుకాగా వీరిలో 217 మంది తదుపరి వ్రాత పరీక్షకు అర్హత సాధించారు. కానిస్టేబుల్ ల ఎంపిక ప్రక్రియలో ఆరవ రోజు అభ్యర్థులకు పరీక్షల నిర్వహణకు కానిస్టేబుల్ ల ఎంపిక ప్రక్రియ ఇంచార్జ్ ఎస్పీ వి.రత్న అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. ఎస్పీ ఆధ్వర్యంలో హాజరయిన 609 మందికి సర్టిఫికెట్ల పరిశీలన, ఫిజికల్ మెజర్మెంట్లో భాగంగా ఎత్తు, ఛాతీ కొలిచారు. అనంతరం ఫిజికల్ ఎఫిషియన్సీ పరీక్షలు నిర్వహించగా 80 మంది తదుపరి ప్రక్రియకు ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ లెవెల్ రిక్రూట్మెంట్ బోర్డు ఆదేశాలు, నియమ నిబంధనలు మేరకు ఈ పరీక్షలు పటిష్టంగా జరిపించారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ మొదలు... బయోమెట్రిక్ అథెంటికేషన్, ఫిజికల్ మెజర్మెంట్ పరీక్షలు, ఆర్ఎఫ్ఐడి ట్యాగుల పంపిణీ, ఫిజికల్ ఎఫిషియన్సీ పరీక్షలు (1600 మీటర్లు, 100 మీటర్ల పరుగు, లాంగ్ జంప్) రిజల్ట్ కౌంటర్ వరకు కేటాయించిన విధులను సిబ్బంది పకడ్బందీగా నిర్వహించారు. ఇక పరుగు పందెంలో అలసిన అభ్యర్థులకు వైద్యులు ప్రథమ చికిత్స అందించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్.పి ఏ.ఆర్ శివానంద కిషోర్, చిత్తూర్ టౌన్ టి.సాయినాథ్, ఏ.ఆర్. డి.ఎస్.పి చిన్ని కృష్ణ, ఒకటవ పట్టణ ఇన్స్పెక్టర్ జయరామయ్య, రిజర్వు ఇన్స్పెక్టర్లు సుధాకర్, జిల్లా పోలీసు కార్యాలయం ఏ.ఓ, ఏ.ఓ.ఓ, సూపరింటెండెంట్లు, సిబ్బంది, ఐ.టి కోర్ టీం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తిరుమలకు విచ్చేసే భక్తుల ఆరోగ్య భద్రతే టీటీడీ ప్రథమ లక్ష్యం

- హోటళ్ల వ్యాపారులకు అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి పిలుపు

విశాలాంధ్ర-తిరుపతి: తిరుమలకు వచ్చే యాత్రికుల ఆరోగ్య భద్రతకు భరోసా కల్పించడం టిటిడి ప్రథమ లక్ష్యమని, తిరుమల లోని హోటళ్ల యజమానులు భక్తులకు ఆహారాన్ని అందించడంలో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని టీటీడీ అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి చెప్పారు. తిరుమలలోని ఆస్థాన మండపంలో సోమవారం సాయంత్రం హోటళ్ల యజమానులతో ఏర్పాటు చేసిన సమావేశంలో అదనపు ఈవో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు ఈవో మాట్లాడుతూ, తిరుమలలోని అన్ని హోటళ్లు, తినుబండార కేంద్రాలు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు భక్తుల ఆరోగ్య భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. తినుబండా రాల ఆవరణలో పరిశుభ్రత, పాటించాలని, నిబంధనలు, మార్గదర్శకాలను పాటిస్తూ తిరుమల ఖ్యాతిని నిలబెట్టాలని సూచించారు. సరైన సీటింగ్ ఏర్పాట్లు, పొడి మరియు తడి చెత్తలను వేర్వేరు డస్ట్ బిన్‌లలో వేరు చేయడం, హోటల్ నిర్వాహణ ధృవపత్రాలను తమ హోటళ్ల బయట ప్రదర్శించడం, ముడి సరుకుల నిల్వ కోసం సరైన నిల్వ గది ఏర్పాటు, పెస్ట్ కంట్రోల్ మెషీన్‌లను ఉంచడం, సరైన అగ్నిమాపక భద్రతా చర్యలు తీసుకోవడం, పారిశుద్ధ్య విధానాలను పాటించడం వంటివి తప్పకుండా పాటించాలని ఆయన అన్నారు. అనంతరం దుకాణదారులందరికీ ఎస్ఓపీ జాబితాను సిద్ధం చేయాలని, చెక్‌లిస్ట్ ఇవ్వాలని, ఏవైనా కొరత ఉంటే వాటిని సరిదిద్దేందుకు కొంత సమయం ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇక నుంచి కన్సల్టెంట్‌ను ఏర్పాటు చేస్తామని, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు క్రమం తప్పకుండా తనిఖీలు చేస్తారని, ఆయన చెప్పారు. తిరుమలలోని అన్ని తినుబండార కేంద్రాలు పరిశుభ్రత పాటించాలని, యాత్రికుల భద్రతే ప్రధాన అజెండాగా టీటీడీ ఖ్యాతిని నిలబెట్టాలని అదనపు ఈఓ పునరుద్ఘాటించారు. ఎస్టేట్స్ అధికారి వెంకటేశ్వర్లు, డిప్యూటీ ఈవో హెల్త్ ఆశాజ్యోతి, హెల్త్ ఆఫీసర్ మధుసూదన్, విజిఓలు రామ్‌కుమార్, సురేంద్ర, తిరుమలలోని పలు తినుబండార కేంద్రాల యజమానులు, ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వ్యాపార సముదాయాల నుండి చెత్త సేకరణ పక్కాగా చేయాలి

విశాలాంధ్ర-తిరుపతి: నగరంలో వ్యాపార సముదాయాలు, అపార్ట్మెంట్లు నుండి చెత్తను వేర్వేరుగా సేకరించాలని, ప్రజలకు ఆహ్లాదాన్ని అందించే పార్కులను శుభ్రంగా ఉంచాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. నగరంలో అభివృద్ధి పనులు, ఇంటింటి చెత్త సేకరణ, పన్నుల వసూళ్లు, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక వినతుల పరిష్కారం తదితర అంశాలపై అధికారులతో సోమవారం కమిషనర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ఇంటింటి చెత్త సేకరణ లాగానే అన్ని హోటల్స్, వ్యాపార సముదాయాల వద్ద వేర్వేరుగా చెత్త సేకరణ చేయాలని అన్నారు. వేరు చేసిన చెత్తను అందరూ నగరపాలక సంస్థ సిబ్బందికి అందించేలా చూడాలని అన్నారు. నగర ప్రజలకు ఆహ్లాదాన్ని అందిస్తున్న పార్కులను శుభ్రంగా ఉంచాలని అన్నారు. పార్కులు, స్కూల్స్‌లో మరుగుదొడ్లు లేవని ఫిర్యాదులు వస్తున్నాయని, అంచనాలు సిద్ధం చేస్తే మరుగుదొడ్లు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. మొదటిదశలో రోడ్లలో గుంతలు పూడ్చడం జరిగిందని, ఇప్పుడు గుర్తించినవి కూడా త్వరగా పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. వీటన్నింటినీ యాప్ లో అప్లోడ్ చేయాలని అన్నారు. పన్నులను సకాలంలో వసూలు చేయాలని అన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక లో వచ్చిన వినతులు సకాలంలో పరిష్కరించాలని అన్నారు. అన్నా క్యాంటీన్ల నిర్వహణ, నాణ్యమైన భోజనం అందించేలా పర్యవేక్షణ చేయాలని అన్నారు. అన్ని సక్రమంగా ఉన్నవి పరిశీలించి టి.డి.ఆర్. బాండ్ల తయారీకి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అన్ని విభాగాల అధికారులు అందరూ సమన్వయం చేసుకుని అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ అధికారులు సేతు మాధవ్, రవి, వెటర్నరీ ఆఫీసర్ నాగేంద్ర, ఉద్యానవన శాఖాధికారి హరికృష్ణ, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసులు రెడ్డి, మేనేజర్ హసీమ్, డి.ఈలు, సూపరింటెండెంట్లు, శానిటరీ సూపర్ వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 39 వినతులు

కమిషనర్ ఎన్.మౌర్య.

విశాలాంధ్ర-తిరుపతి: తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజల నుండి 39 వినతులు వచ్చాయని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. టౌన్ క్లబ్ పక్కన రోడ్డు వెడల్పు కోసం తీసుకున్న స్థలానికి టి.డి.ఆర్. బాండ్ ఇవ్వాలని డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ కోరారు. కాగా తాము కొర్లగుంట మారుతినగర్ నందు నివసిస్తున్నామని, రికార్డుల్లో ముత్యాలరెడ్డి పల్లి న్యూ మారుతి నగర్ గా నమోదు అయినదని మార్పు చేయాలని కోరారు. టి.డి.ఆర్. బాండ్లు ఇప్పించాలని, రాజీవ్ గృహకల్ప కింద ఇంటికోసం డబ్బులు కట్టామని ఇల్లు రాలేదు మా నగదు మాకు ఇవ్వాలని కోరారు. తాను మాజీ సైనికుడిని నాకు గృహ నిర్మాణ పథకంలో ఇల్లు ఇప్పించాలని, శివజ్యోతి నగర్ నందు వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం వలన చుట్టూ పక్కల బోర్లలో నీరు రావడం లేదని తగు చర్యలు తీసుకోవాలని కోరారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ హైస్కూల్ ను జూనియర్ కాలేజీగా అప్గ్రేడ్ చేయాలని, శెట్టిపల్లి పట్టాదారులకు రెండు సెంట్లు స్థలం ఇవ్వాలని, పోస్టల్ కాలనిలో చెట్లు తొలగించాలని, సి.సి రోడ్లు వేయాలని కోరారు. ఆయా విభాగాల అధికారులు వెంటనే సమస్యలు పరిష్కరించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ ఆఫీసర్ సేతు మాధవ్, రవి, వెటర్నరీ ఆఫీసర్ నాగేంద్ర, మేనేజర్ హసీమ్, హార్టికల్చర్ ఆఫీసర్ హరికృష్ణ, డి.ఈ.లు, సూపరింటెండెంట్లు, శానిటరీ సూపర్ వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు లోబడి నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్

- అవిలాల చెరువు అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయండి
- అధికారులకు కలెక్టర్ దిశా నిర్దేశం

విశాలాంధ్ర - తిరుపతి కలెక్టరేట్ : నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నిబంధనలకు లోబడి అవిలాల చెరువు అభివృద్ధిపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ సమీక్ష నిర్వహించి పూర్తిస్థాయి ప్రణాళికలు సిద్ధం చేయాలని పేర్కొన్నారు.సోమవారం మధ్యాహ్నం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరం నందు జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అవిలాల చెరువును ఎన్జిటి నిబంధనలకు లోబడి అభివృద్ధి చేయుట కొరకు పూర్తి స్థాయిలో ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్‌కు అవిలాల చెరువు అభివృద్ధిపై పచ్చదనం పెంపు, వాకింగ్ ట్రాక్, చెరువు కరకట్ట బలోపేతం చేయడం తదితర అంశాలను, వాటికి అవసరమయ్యే నిధుల అంశాలపై వివరించారు. ఈ సమావేశంలో తుడా సెక్రెటరీ డా. వెంకట నారాయణ, ఎస్.ఈ కృష్ణారెడ్డి, ఈఈ రవీంద్ర, ఉద్యాన శాఖ అధికారిణి మాలతి, టిటిడి ఈఈ మనోహర్, ఇరిగేషన్ ఈఈ ప్రసాద్, ఆర్కిటెక్ట్ రఘురామన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఛార్జీల ప్రతిపాదనలపై నేటి నుంచి బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ

- ఎపిఎస్ పిడిసిఎల్ సిఎండి కె. సంతోష రావు

విశాలాంధ్ర - తిరుపతి : ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఎపి.ఎస్పిడిసిఎల్) 2025-26 ఆర్థిక సంవత్సరానికిగాను సమర్పించిన ఆర్థిక ఆవశ్యకత, విద్యుత్ ఛార్జీల ప్రతిపాదనలపై ఈనెల 7వతేఈ నుంచి ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణా మండలి (ఎపిఇఆర్‌సి) బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎపిఎస్పి డిసిఎల్ చైర్మన్ - మేనేజింగ్ డైరెక్టర్ కె. సంతోష రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 7, 8వతేదీల్లో విజయవాడలోని ఎ కన్వెన్షన్ సెంటర్లోనూ, 10వతేదీన కర్నూలులోని రాష్ట్ర విద్యుత్ నియంత్రణా మండలి కార్యాలయంలో ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం జరుగు తుందన్నారు. ఈ మూడు రోజుల్లో ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నేరుగానూ, తర్వాత మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వినియోగదారులు, అభ్యంతర దారులు సూచ నలు/ అభ్యంతరాలను వెల్లడించవచ్చని తెలిపారు. ఎపిఇఆర్సి చైర్మన్(ఇన్చార్జ్) ఠాకూర్ రామ్ సింగ్ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో అభ్యంతరదారులు తమకు సమీపంలోని విద్యుత్ సర్కిల్ / డివిజనల్ కార్యాలయాల నుంచి పాల్గొని, టారిఫ్ ప్రతిపాదనలపై సూచనలు/అభ్యంతరాలు/ అభిప్రాయాలను తెలియజేయ వచ్చన్నారు. వినియోగదారులు తమ మొబైల్/ ట్యాబ్/ల్యాప్టాప్/డెస్క్ టాప్ లలో https://eliveevents.com/apercpublichearing లింక్ ద్వారా ఈ కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించవచ్చని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

సామాజిక పింఛన్లను అంగన్వాడీలకు ఇవ్వాలి

విశాలాంధ్ర - పలమనేరు : రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు వివిధ రకాల సామాజిక పెన్షన్లు అందిస్తున్న వాటిని అర్హులైన అంగన్వాడి టీచర్లు, హెల్పర్లకు, మినీ వర్కర్లకు కూడా అందించాలని ఫోరం పర్ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ మినీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి సరస్వతి డిమాండ్ చేశారు. అందులో భాగంగా సోమవారం పలమనేర్ పట్టణంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా సరస్వతి మాట్లాడుతూ అంగన్వాడి వర్కర్లు హెల్పర్లు, మినివర్కర్లు చాలీ చాలని గౌరవేతనాలతో పట్టణ ,గ్రామీణ ప్రజలకు ప్రభుత్వం ఇస్తున్న పథకాలను అందిస్తున్నామని ప్రభుత్వాలకు తెలిసిన మాపై దయ చూపలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పట్టణ ,గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న అంగన్వాడీలకు ఆదాయ నిబంధనలు పెట్టి సామాజిక పెన్షన్లను అందించకుండా చేయడం సరికాదన్నారు. చిలకమ్మా, మంగ˘మ్మ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదాయ నిబంధనలను తొలగించి అందరితో పాటు సామాజిక పెన్షన్లు అందిం చాలని కోరారు. అదేవిధంగా అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, కనీస వేతనాలు ఇవ్వాలని, మిని వర్కర్లను మెయి న్ వర్కర్లుగా గుర్తించాలని, ప్రభుత్వ ఉద్యోగులతో పాటు ప్రతినెల 1వ తేదీ వేతనా లు మంజూరు చేయాలని కోరారు. అంగన్వాడీల పైన అధికారులు, రాజకీయ నాయకుల వేధింపులు మానుకోవాలని, కొత్త సెల్ ఫోన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

సౌరశక్తి పైలట్ ప్రాజెక్టును లాంచనంగా ప్రారంభించిన సిఎం

విశాలాంధ్ర - కుప్పం : కుప్పం నియోజకవర్గ మూడురోజుల పర్యటనలో భాగంగా సిఎం, కుప్పం నియోజకవర్గ ముద్దుబిడ్డ చంద్ర బాబు సోమవారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సొంత నియోజక వర్గం చిత్తూరు జిల్లా కుప్పం ను పైలట్ ప్రాజెక్టుగా తీసుకొని ప్రతి ఇంటికి సౌర పలకలను అమర్చుటకు కుప్పం గ్రామీణ మండలం నడు మూరు నందు పిఎం సూర్య ఘర్ యోజన పథకం కింద ప్రజలకు రాయితీతో ప్రతి ఇంటికి సౌర విద్యుత్ ను అందించ డంలో భాగంగా కార్యక్రమం ను లాంఛనంగా ప్రారంభించెందుకు విచ్చేసిన.రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబునా యుడుకి మంగళ వాయిద్యా లతో స్థానికులు ఘన స్వాగతం పలికారు. లాంఛనంగా లబ్ధిదారుడు సుబ్రహ్మణ్యం ఇంటి లో ముఖ్యమంత్రి సౌర విద్యుత్ పథకంను ప్రారంభించారు. సౌర విద్యుత్ వాడకం దాని పనితీరు ను ముఖ్య మంత్రికి సి.ఎస్. విజయా నంద్. వివరించారు. సౌర విద్యుత్ వినియోగం పై లబ్ధిదారులతో ముఖ్య మంత్రి ముఖాముకి లో పాల్గొన్నారు.

కత్తి అంకమ్మ మృతికి సీపీఐ నేతల నివాళి

విశాలాంధ్ర - బుచ్చినాయుడు కండ్రిగ : మండలంలోని జంబుగోళం గ్రామంలో మాజీ సింగిల్ విండో మెంబర్ కత్తి అంకమ్మ ఆదివారం రాత్రి మృతి చెందడంతో సీపీఐ నాయకులు సోమవారం ఆమె మృతికి నివాళులు అర్పించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ.రామానాయుడు, జిల్లా కార్యదర్శి పి.మురళి, జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య కే.రాధాకృష్ణ, జె విశ్వనాథ్, జనమాల గురవయ్య, బండి చలపతి, ఉదయ్ కుమార్, సీపీఐ శ్రీకాళహస్తి పట్టణ కార్యదర్శి గోపి, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రవీణ్ తదితరులు అంకమ్మ మృత దేహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రామానాయుడు, మురళి మాట్లాడుతూ అంకమ్మ అనేక సంవత్సరాలుగా కమ్యూనిస్టు పార్టీ సభ్యురాలుగా కొనసాగుతూ ఉండడం గతంలో కమ్యూనిస్టు పార్టీ తరపున నేటిపారుదల సింగిల్ విండో మెంబర్ గెలవడం గెలవడం కమ్యూనిస్టు పార్టీ గౌరవాన్ని నిలిపిందన్నారు. ఆమె కుటుంబం నుంచి ఆమె కుమారులు కత్తి ధర్మయ్య, కత్తి రవిలు కమ్యూనిస్టు పార్టీలో పనిచేయడానికి ప్రోత్సహిం చడం వారు మంచి లీడర్లుగా కమ్యూనిస్టు పార్టీలో పని చూస్తుండడం శుభ పరిణామన్నారు, ఈ కుటుంబం మొత్తం కమ్యూనిస్టు పార్టీకి అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తూ ఎంతోమంది కమ్యూ నిస్టు నాయకులకు ఆతిథ్యాన్ని ఇస్తూ ఏ సమయంలో వచ్చిన కడుపు నిండా భోజనం పెట్టి పంపించే పెద్ద మనసున్న మంచి మనిషిని అంకమ్మ అన్నారు, అమే మృతికి సంతాపం వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని ప్రకటించారు. కుమారులైన కత్తి ధర్మయ్య కత్తి సురేష్, కత్తి రవి, కోడళ్లను, అందరినీ పరామర్శించి వారికి ధైర్యా న్ని ఇచ్చి సిపిఐ తరుపున భరోసా ఇవ్వడం జరిగింది. ఆమె మృత దేహానికి పూలమాలు వేసి సంతాపం తెలిపారు. సత్యవేడు నియోజ కవర్గం సిపిఐ నాయకుడు చిన్ని రాజ్, అజయ్ కుమార్ రెడ్డి, నివాళులర్పించారు. పలు రాజకీయ పార్టీ నాయకులు నివాళులర్పించారు.

మంత్రి వర్గంలోకి బొజ్జల?

- ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి అవకాశం
- విస్తరణలో సుధీర్‌కు వరించనున్న అదృష్టం
- వీస్తున్న సానుకూల పవనాలు

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి: ఏపీ మంత్రి వర్గ విస్తరణ త్వరలో జరగనుంది. ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి రేసులో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ముందు వరుసలో ఉన్నట్లు తెలుస్తోంది. ఆ మేరకు ఖరారుపై అధిష్ఠానం నుంచి స్పష్టత వచ్చినట్లు ప్రచారం సాగుతోంది. దీంతో శ్రీకాళహస్తిలో కూటమి నేతల్లో హర్షాతి రేకాలు వ్యక్తమవుతున్నాయి. సంక్రాంతి తర్వాత జరిగే ఆంధ్రప్రదేశ్ మంత్రి వర్గ విస్తరణపై ఇప్పుడు చర్చంతా ఎవరు ఉండబోతారనే దానిపై జరగుతోంది. ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి తొలి విడత మంత్రి వర్గ విస్తరణలో ఎవరికీ స్థానం దక్కలేదు. ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు మినహా జిల్లా నుంచి ఎవరూ మంత్రి వర్గంలో లేరు. ఇప్పుడు రెండో విడత జరిగే మంత్రి విస్తరణలో స్థానం లభించే అవకాశం ఉంది. ఈ రేసులో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. మాజీ మంత్రి స్వర్గీయ బొజ్జల గోపాల కృష్ణారెడ్డితో నారా చంద్రబాబు నాయుడుకు మధ్య విడదీయరాని అనుబంధం ఉంది. ఆ అనుబంధాన్ని శ్రీకాళహస్తి పర్యటనకు వచ్చిన సందర్భంగా పలుమార్లు స్వయంగా చంద్రబాబు ప్రస్తావించారు. ఆయన వారసునిగా బొజ్జల వెంకట సుధీర్ రెడ్డిని తీసుకురావాలనే సంకల్పంతో తొలిసారి ఓటమి చెందినా రెండో దఫా ఎన్నికల్లో తీవ్ర పోటీ నెలకొన్నా బొజ్జల కుటుంబానికే అభ్యర్థిత్వాన్ని కేటాయించారు. బాబు నమ్మకాన్ని వమ్ము చేయకుండా రికార్డు స్థాయి మెజారిటీతో సుధీర్ రెడ్డి తిరుగులేని విజయం సాధించారు. అంతకుముందు మంత్రి నారా లోకేష్ చేపట్టిన యువ గళం పాదయాత్ర శ్రీకాళహస్తి నియోజకవర్గంలో విజయవంతం చేయడంలో సుధీర్ రెడ్డి సఫలీకృతమయ్యారు. అప్పటి వరకు వారి మధ్యనున్న అనుబంధం మరింత బలపడింది. బొజ్జల కుటుంబంపై చంద్రబాబుకు ఉన్న అనుబంధం.. రాష్ట్ర మంత్రి నారా లోకేష్ తో ఉన్న అనుబంధం ఆశీ స్సులు పుష్కలంగా ఉండడంతోపాటు యువ నేత బొజ్జల వెంకట సుధీర్ రెడ్డికి అదృష్టం వరించడానికి అవకా శాలు మెండుగా గా చెబుతున్నారు. దానికి తోడు ఈ దఫా మంత్రి వర్గంలో యువతకు పెద్దపీట వేయాలనే ఆలోచన, ఉన్నత విద్యావంతుడు కావడంతో పాటు వ్యవస్థలపై మంచి పట్టుండడం కూడా సుధీర్ కు కలిసొచ్చే అవకాశంగా చర్చ నడుస్తోంది. ఇందుకు గెలిచిన వెంటనే ప్రక్షాలన ద్వారా శ్రీకాళహ స్తీశ్వరాలయ అభివృద్ధికి ప్రణాళికలతోపాటు ఆదాయాన్ని గణీయంగా పెంచడం, పాలనా వ్యవహారాల్లో సమర్ధతపై కూడా అధిష్ఠానం నిర్వహించిన సర్వేలో గుర్తించడంతో అవకాశాలపై అనుకూల పవనాలు వీస్తున్నాయి. దీనికితోడు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తిరుపతి జిల్లా కూడా ఉండడం ఉమ్మడి నెల్లూరు జిల్లాల నుంచి సూళ్లూరుపేట, గూడూరు నియోజకవర్గాలు కలిశాయి. దీంతో సామాజికవర్గాల సమీకరణలో కూడా సుధీర్ రెడ్డి బెర్తు ఖరారుపై స్పష్టత వస్తోన్నట్లు చెబుతన్నారు. అధిష్ఠానం మొగ్గు కూడా బొజ్జలపైనే ఉన్నట్లు ఇప్పటికే జోరుగా ప్రచారం సాగుతుండడంతో శ్రీకాళహస్తి కూటమి నేతల్లో హర్షాతీరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఆ మేరకు ఖరారుపై స్పష్టత వచ్చినా సాగుతున్న ప్రచారంలో బొజ్జలకు వరించే అదృష్టంపై మరికొన్ని రోజులు వేచిచూడాల్సి ఉంది.